# భయమును గూర్చి ముక్కుసూటి మాట



భావోద్రేక పోరాటములను దేవుని వాక్యశక్తితో జయించుట

## జాయిస్ మేయర్

గతంలో ఈ పుస్తకము *“సహాయము చేయండి! నేను భయపడుచున్నాను”* అను పేరుతో ప్రచురితమైంది

# భయమును గూర్చి

ముక్కుసూటి మాట

# భయమును గూర్చి

ముక్కుసూటి మాట

భావోద్రేక పోరాటములను
దేవుని వాక్యశక్తితో జయించుట

## జాయిస్ మేయర్

JOYCE MEYER
MINISTRIES ®
Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills, Hyderabad - 500 033

Unless otherwise indicated, all Scripture quotations are taken from *The Amplified Bible* (AMP). *The Amplified Bible, Old Testament,* copyright © 1965, 1987 by The Zondervan Corporation. *The Amplified Bible, New Testament,* copyright © 1954, 1958, 1987 by The Lockman Foundation. Used by permission.

Scripture quotations marked KJV are taken from the *King James Version* of the Bible.

Originally published as *Help Me I'm Afraid*

Copyright © 2018 by Joyce Meyer Ministries - Asia

All rights reserved. No part of this publication may be reproduced, distributed, or transmitted in any form or by any means, or stored in a database or retrieval system, without the prior written permission of Joyce Meyer Ministries - Asia.

Joyce Meyer Ministries - Asia
Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033

Phone: +91-40-2300 6777
Website: www.jmmindia.org

Straight Talk on FEAR - *Telugu (R1 - 2018)*
*Overcoming Emotional Battles with the Power of God's Word!*

*Printed at:*
Caxton Offset Pvt. Ltd.
Hyderabad - 500 004

# విషయసూచిక


*పరిచయం* vii

*మొదటి భాగం* – **భయం నుండి విడుదల** 1

1. భయాన్ని ఎదుర్కొనండి 3
2. ప్రతి విషయాన్ని గురించి ప్రార్థించండి దేనిని గూర్చి భయపడవద్దు! 15
3. పలువిధములైన ప్రార్థనలు 29
4. పరలోకరాజ్యమునకు తాళపు చెవులు 45

ముగింపు 59

*రెండవ భాగము* – **లేఖనభాగములు** 61

భయాన్ని జయించుట 62

**ప్రార్థన**

భయంతో పోరాడుటకు 66

ప్రభువుతో వ్యక్తిగత సంబంధం నిమిత్తం ప్రార్థన 67

రక్షణ కొరకు ప్రార్థన 69

# పరిచయం

యేసు క్రీస్తులో విశ్వాసముంచుట వలన కల్గిన ఆత్మీయ స్వాస్థ్యంలో మనకు అందుబాటులో ఉన్న ఎన్నో ప్రయోజనాల్లో ఒకటి భయం నుండి విడుదల పొందుట. మనం భయపడినప్పటికీ, మనం ముందుకు సాగి పనిచేయగలమని మనకు తెలుసు. ఎందుచేతనంటే మనలను కాపాడుటకు దేవుడు మనతో ఉన్నాడు. ఆయన మనకు సహాయం చేస్తాడు. మన కొరకు యుద్ధంచేయుటకు మనలను విడిపించుటకు ఆయన ముందుగా వెళ్తాడు. మనం ఆయనకు విధేయులమై యుండగా విజయంతో మనలను నడిపిస్తాడు.

భయ కారణం వల్ల నీ జీవితంలో ఏమైనా పోగొట్టుకున్నట్లు నీవు తలంచినట్లయితే, భయం కలుగునప్పుడు ఏ విధంగా ప్రవర్తించాలో ఈ పుస్తకంద్వారా నేర్చుకుంటావు. దేవుడు నీకొరకు ఉద్దేశించిన సమృద్ధియైన జీవితం అనుభవించడం ప్రారంభిస్తావు.

*1వ భాగం*

# భయం నుండి విడుదల

# 1

# భయాన్ని ఎదుర్కొనండి

*"భయపడకుడి, వారిని చూచి దిగులుపడకుడి, నీతో కూడ వచ్చువాడు నీ దేవుడైన యెహోవాయే; ఆయన నిన్ను విడువడు నిన్నెడబాయడు"*

ద్వితీయోపదేశకాండము 31:6

# 1

# భయాన్ని ఎదుర్కొనండి

“భయపడకుము, యెహోవానైన నేను నీతో ఉన్నాను” అనే సందేశం బైబిలంతటిలో వేరు వేరు విధానాల్లో తెలియజేయబడింది. మనం భయపడడం దేవునికి ఇష్టం లేదు. ఎందుచేతనంటే దేవుడు మనకు సిద్ధపరచినవన్నీ అందుకొనకుండ భయం అడ్డుకుంటుంది. ఆయన మనలను ప్రేమించి, ఆశీర్వదించాలని కోరుచున్నాడు. మనం భయపడకుండుటకు ఆయన తగిన మార్గాలు ఏర్పాటు చేశాడు.

ఈ క్రింది వాక్యభాగంలో యేసుక్రీస్తునందు విశ్వాసముంచిన మనం “లోకస్తులైన” అవిశ్వాసులు భయపడే వాటికి భయపడనవసరం లేదని, ఆ విషయాల గురించి మనం భయపడడం దేవునికి యిష్టం లేదని వివరించబడింది.

> “ఈ జనులమార్గమున నడువకూడదని యెహోవా బహు బలముగా నాతో చెప్పియున్నాడు; నన్ను గద్దించి యీ మాట సెలవిచ్చెను – ఈ ప్రజలు బందుకట్టు అని చెప్పునదంతయు బందుకట్టు అనుకొనకుడి. వారు భయపడుదానికి భయపడకుడి దానివలన దిగులు పడకుడి.

సైన్యములకధిపతియగు యెహోవాయే పరిశుద్ధుడనుకొనుడి. మీరు భయపడవలసినవాడు ఆయనే, ఆయన కోసరమే దిగులుపడవలెను. అప్పుడాయన మీకు పరిశుద్ధస్థలముగా నుండును"

యెషయా 8:11-13

ఆయన యొక్క బలాతిశయమును బట్టి మనం జయజీవితం జీవించగలమని ఆయన వాక్యంలో దేవుడు మనకు చెప్పుచున్నాడు. ఏమి సంభవించినప్పటికీ ఆయన మనలను ఎన్నడు విడువనని, యెడబాయనని వాగ్దానం చేశాడు.

## భయముండదు

భయాన్ని గూర్చిన తలంపులతో మనలో ప్రతి ఒక్కరం విశ్వాసము నుండి బయటకు అడుగు వేయడం ప్రారంభిస్తాం. భయానికి మూలం సాతాను అని మనం గ్రహించవలసిన అవసరత ఉంది. 1 యోహాను 4:18 ఈ విధంగా సెలవిస్తుంది.

"ప్రేమలో భయముండదు; అంతేకాదు; పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టును; భయము దండనతో కూడినది; భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు."

మనలను బాధపెట్టి, ఎంతో అనుమానంతో నింపుటకు మరియు అధమస్థాయిలో ఉంచు ప్రయత్నంలో సాతాను మనలోనికి భయాన్ని పంపిస్తాడు. దేవుడు మనలను చేయాలని కోరిన పనులు చేయకుండా మనం ఆటంక పరచబడతాం, ఆయన మనకొరకు సిద్ధపరచినవన్నీ అందుకోలేక పోతాము.

దేవుడు తన వాక్యంలో చెప్పిన విధంగా మన విశ్వాసమును బలపరచుకొనుట ద్వారా భయం లేకుండా మనం జీవించగలం.

"దేవుడు మనకు శక్తియు ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమునుగల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనముగల ఆత్మ నియ్యలేదు."

2 తిమోతి 1:7

"భయపడకుడి, వారిని చూచి దిగులుపడకుడి, నీతో కూడా వచ్చువాడు నీ దేవుడైన యెహోవాయే; ఆయన నిన్ను విడువడు నిన్నెడబాయడు."

ద్వితీయోపదేశకాండము 31:6

రోమా 10:17 ఈ విధంగా సెలవిస్తుంది. "కాగా వినుటవలన విశ్వాసము కలుగును; వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును." ఈ పుస్తకం ప్రారంభంలో, ముగింపులో ఉదహరించిన లేఖన భాగములను గ్లాసుతో నీళ్ళు త్రాగిన విధంగా నేర్చుకొని, వాటిని పెదవులతో గట్టిగా ఒప్పుకోవాలి. ప్రభువు మనకు ఏమి చెబుతాడో, మనలను గురించి ఏమి చెప్పాడో దానిని మన నోటితో ఒప్పుకుంటునప్పుడు, మనలను బాధపరిచి ఆటంకపరిచే భయాలను జయించుటకు దేవుని వాక్యం మనకు శక్తినిస్తుంది.

"ఆయననుబట్టి (ఖచ్చితంగా) మనకు కలిగిన ధైర్యమేదనగా, (తప్పక జరుగునన్న నిశ్చయత), ఆయన చిత్తానుసారముగా (ఆయన ఏర్పాటు ననుసరించి) మనమేది అడిగినను (ఏమనవియైనను) ఆయన మన మనవి ఆలకించుననునదియే. మనమేమి అడిగినను ఆయన మన మనవి ఆలకించునని మనమెరిగినయెడల (మనము నిజముగా ఎరుగుదుము గనుక) మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని (మన మనవులు మన స్వాస్థ్యముగా ఇచ్చెనని) యెరుగుదుము"

1 యోహాను 5:14,15

ప్రార్థించుటలో, దేవుని వాక్యం ఒప్పుకొనుటలో శక్తి వుంది. అది ఆయన బయలు పరచిన చిత్తం. ప్రార్థన సమయంలో మనం చేయవలసిన అతి

ప్రాముఖ్యమైన విషయాల్లో ఒకటి వాక్యము ఒప్పుకోవడం అని నేను ఒప్పించబడ్డాను.

భయము చేత గాని, లేక భీతిచేత గాని, లేక సందేహంతో గాని, లేక ఏదో ఒక కారణంతో గాని మన జీవితంలో ఏదైనా విషయాన్ని ఎదుర్కొనకుండా నిర్లక్ష్యం చేయగోరితే మనం చేయవలసినది ఏమనగా వాక్యంలో ఆయన వాగ్దానం చేసిన వాటిని మనపట్ల జరిగించమని ప్రార్థించాలి, అడగాలి. ఆయన మనకు ముందుగా వెళ్లి, మన కొరకు మార్గం సరళం చేయమని కోరాలి. మనము దేవుని అడుగుట లేదు కాబట్టి మనకేమియు దొరుకుట లేదని యాకోబు బోధిస్తున్నాడు (యాకోబు 4:2). "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరకును, తట్టుడి మీకు తీయబడును" అని యేసు మనకు చెబుతున్నాడు. (మత్తయి 7:7)

ఉదాహరణకు మనం ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ ఎదుర్కొంటున్నప్పుడు, మనం తప్పుడు అభిప్రాయం కలిగి, మనం కోరిన స్థానం సంపాదించుటకు ఓడిపోతామనే భయం కలిగి ఉండుటకు బదులు, ప్రభువు మనతో ఉండాలని, మనకు ముందుగా వెళ్లి మన కొరకు మార్గం సరళం చేయుమని ఆయనను అడిగే అవసరత మనకు ఉంది. దాని ఫలితంగా ఎంతో జ్ఞానయుక్తంగా జవాబు చెప్పగలం. తరువాత ఏమి జరిగినా మన పట్ల దేవుని పరిపూర్ణ చిత్తం, ఆయన ప్రణాళిక ప్రకారం అది మనకు మేలుగా మారుతుందని మనకు నమ్మకం కల్గుతుంది.

## భయానికి నీవు చేయవలసినది ఏమి?

హారానులో దేవుడు అబ్రాముతో ఈ విధంగా చెప్పాడు, యెహోవా — నీవు లేచి (నీ స్వంత ప్రయోజనం నిమిత్తం) నీ దేశమునుండియు నీ బంధువులయొద్దనుండియు నీ తండ్రి యింటినుండియు బయలుదేరి నేను నీకు చూపించు దేశమునకు వెళ్ళుము.

ఆదికాండము 12:1

దేవుడు నీ గృహాన్ని, నీ కుటుంబాన్ని, నీవు అనుభవిస్తున్న సౌకర్యాలన్నీ విడిచి నీకు తెలియని ప్రదేశానికి ఎక్కడికో వెళ్లాలని నీతో చెబితే నీకు కలిగే భావనలేవి? భయంతో నిండిపోతావా?

ఈ వాక్యభాగంలో అబ్రాము ఖచ్చితంగా ఎదుర్కొన్న సవాలు ఇది. ఈ సవాలు అతన్ని భయపెట్టింది. అందుకే పదే పదే "భయపడకుము" అని దేవుడు చెప్పాల్సి వచ్చింది.

దేవుడు ఇశ్రాయేలు జనాంగానికి స్వాస్థ్యంగా వాగ్దానం చేసిన దేశానికి వారిని నడిపించమని ఆయన యెహోషువాను పిలిచినప్పుడు ఇదే ఆజ్ఞ అతనికి యిచ్చాడు (యెహోషువ 1:6,7,9).

ఎవరైనా దేవుని కొరకు ఏదైనా చేయాలనుకొన్నప్పుడు "భయపడకుము" అనే మాటలు ప్రభువు సారి సారికి వినిపిస్తూ ఉంటాడు.

ఈక్వేడార్‌లో చంపబడిన ఐదుగురు మిషనరీల్లో ఒకరి భార్యయైన ఎలిజబెత్ ఎలియట్, ఆ సంగతి విన్నప్పుడు తన జీవితం పూర్తిగా భయంతో నిండిపోయింది అని చెప్పింది. ఆమె బయటకు వెళ్ళుటకు అడుగు వేసే ప్రతిసారి భయం ఆమెను ఆపివేసింది. ఆమెకు భయం నుండి విడుదలపొందే ఒక మార్గాన్ని గూర్చి ఆమె స్నేహితురాలు ఆమెతో చెప్పింది. ఆమె ఈ విధంగా చెప్పింది. "భయం పోవడానికి దీనిని నీవెందుకు చేయకూడదు?" అని అన్నది. తత్ఫలితంగా ఎలిజబెత్ ఎలియట్ మరియు చంపబడిన మిషనెరీలో మరొకరి సహోదరి రేచల్ సెయింట్ భారతీయ జాతి ప్రజలకు సువార్త చెప్పుటకు వెళ్ళారు. రేచల్ సెయింట్ యొక్క సోదరుని, ఎలిజబెత్ యొక్క భర్తను చంపిన హంతకులు కూడా అక్కడ ఉన్నారు.

చాలాసార్లు మనలో భయం పోయేవరకు ఏ కార్యమైనా చేయుటకు వేచియుండాలని మనం తలస్తాం. మనం ఆ విధంగా చేసినట్లయితే, దేవుని కొరకు, ఇతరులకొరకు, యింకా మనకొరకు మనం బహుశా ఏమీ

సాధించలేము. దేవునికి, ఆయన ఆజ్ఞాపించిన ఆజ్ఞకు విశ్వాసముతో, విధేయతతో అబ్రాము మరియు యెహోషువ ముందుకు అడుగు వేయవలసి వచ్చింది. భయానికి వారు చేసినది అదే.

“భయానికి దీనిని నీవెందుకు చేయకూడదు” అనే వృత్తాంతం గురించి ప్రభువు నాకు జ్ఞాపకం చేశాడు. తరువాత ఆయన భయం గురించి కొన్ని సంగతులు నాకు చూపించడం ప్రారంభించాడు.

## “భయపడకుము” అంటే “పరుగెత్తవద్దు” అని అర్థం!

> అందుకు మోషే–భయపడకుడి, యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి; మీరు నేడు చూచిన ఐగుప్తీయులను ఇకమీదట మరి ఎన్నడును చూడరు”
>
> నిర్గమకాండము 14:13

దేవుడు నాకు చెప్పుచున్న “భయపడకుము” అను మాటకు అర్థం సాధారణంగా “పరుగెత్తవద్దు” అని నేను గ్రహించాను. ఆ తరువాత భయాన్ని పరిష్కరించడం కూడా సులువే. మనం భయం ఎదుర్కొన్నప్పుడు, ఆ భయానికి లొంగిపోయి దాని యెదుట మోకరించుటకంటె దానికి ఎదురుగా దృఢంగా నిలబడాలి. మనకు ఏ విధంగా భయంకల్గినప్పటికీ దానిని ఎదిరించాలి.

దేవుని వాక్యంలో మనం ఖచ్చితంగా చేయాలని చెప్పే విషయం అది. మన మోకాళ్ళు వణుకుతున్నప్పుడు మన నోరు ఎండిపోయినప్పుడు మనం పడిపోవుటకు సిద్ధంగా ఉన్నామని తలంచినప్పుడు సయితం, మనం ఈ విధంగా చెప్పుతూ ఉండవలసిన అవసరత ఉంది: “ప్రభువా, నన్ను బలపరచు. ఈ విధంగా చేయమని నీవు నాకు చెప్పావు, నీ సహాయంతో ఈ కార్యం చేయబోవుచున్నాను. ఎందుచేతనంటే ఇది నా కొరకు బయలుపరచిన నీ చిత్తం.

నా జీవితం భయంతో పరిపాలించబడకుండా, నీ వాక్యంతోనే పరిపాలించ బడాలని నిశ్చయించుకున్నాను.”

## దేవుని వాక్యంతో భయాన్ని ఎదిరించు

భయం మనం ఆశించినందువల్ల గాని, నిరీక్షించినందువల్ల గాని తొలగిపోదు, దేవుని వాక్యంతోనే దీనిని ఎదిరించాలి, దేవుని వాక్యంతోనే దానిని పరిష్కరించాలి.

ప్రార్థనద్వారా కొన్నిసార్లు అద్భుతంగా ప్రజలు విడుదల పొందిన సందర్భాలు ఉన్నాయి. ఈ విషయంలో ఎటువంటి అనుమానం లేదు. ఎందుచేతనంటే మనం అద్భుతాలు జరిగించే దేవునిని సేవిస్తున్నాం. భయం నుండి విడుదల పొందాలని కొందరిని గురించి నేను ప్రార్థించాను. తరువాత వారు తిరిగి నా దగ్గరకు వచ్చి, “నీవు నన్ను గురించి ప్రార్థించిన తరువాత మరల భయం గురించిన సమస్య నేను ఎన్నడు ఎదుర్కోలేదు” అని చెప్పారు. మన సమయంలో చాలా వరకు, దేవుని వాక్యము మనము ధ్యానించుట ద్వారా, ఆత్మశక్తితో భయాన్ని ఎదుర్కోవడం ద్వారా మనం భయాల మీద జయం పొందగలము.

నా స్వంత విషయానికొస్తే ప్రారంభ సంవత్సరాల్లో నాకు కలిగిన నిందల ఫలితంగా ఎంతో బాధపరచిన గొప్ప సమస్యలను నేను ఎదుర్కొన్నాను. నా జీవితంలో ఎన్నో బంధకాల నుండి విడుదల పొందవలసిన అవసరత ఉండేది. అయితే ఒక చిన్న మినహాయింపు తప్పించి, దేవుని వాక్యము నేను అన్వయించుకొనుట వలన ఆయన వాటన్నిటి నుండి నాకు విడుదల కలుగజేశాడు. దేవుడు ఎల్లప్పుడు కష్టాల నుండి సమస్యల నుండి మనలను విడిపించడు గాని, వాటిగుండా ఆయన మనతో నడుస్తాడు.

## భయం అబద్ధము యొక్క రూపం

“మీరు మీ తండ్రియగు అపవాది సంబంధులు; మీ తండ్రి దురాశలు నెరవేర్చ గోరుచున్నారు. ఆదినుండి వాడు నరహంతకుడైయుండి

సత్యమందు నిలిచినవాడు కాడు; వాని యందు సత్యమేలేదు; వాడు అబద్ధమాడునప్పుడు తన స్వభావము అనుసరించియే మాటలాడును; వాడు అబద్ధికుడును అబద్ధమునకు జనకుడునై యున్నాడు"

యోహాను 8:44

"వణికిపోవద్దు" లేక "చమటోడ్చవద్దు" లేక "కదలిపోవద్దు" అని బైబిలు చెప్పడం లేదు గాని "భయపడవద్దు" అని చెబుతుంది.

ఇక్కడ తేడా వుంది.

ఈ సందర్భంలో భయపడుట అంటే పారిపోవడం లేక పరిగెత్తడం అని అర్థం. ఎలిజబెత్ ఎలియట్ దేని గురించి భయపడి అక్కడి నుండి పారిపోతుందో అక్కడే ఉండి కార్యం చేయమని ఆమె స్నేహితురాలు ఆమెకు సలహా ఇచ్చింది.

భయము అంటే ఇంగ్లీష్ భాషలో "తప్పుడు ఋజువు నిజముగా ఉన్నట్లు చూపించుట అని అసలు అర్థం." "అసత్యము సత్యముగా కనిపించడం."

అపవాది అబద్ధికుడని, అబద్ధాలకు జనకుడని యేసు చెప్పాడు. వాడిలో సత్యము లేదు. దేవుని ప్రజలను భయపెట్టుటకు వాడు మోసపూరితంగా అసత్యాన్ని ఉపయోగించాలని ప్రయత్నిస్తాడు. ఈ కారణం బట్టి ప్రభువుకు విధేయత చూపుటకు చాలినంత ధైర్యం ఉండదు, ఆయన వారికొరకు భద్రపరచిన ఆశీర్వాదాలు పొందలేరు.

చాలాసార్లు ఏ విషయం గురించి భయం కలుగుతుందో ఆ విషయం కంటె భయమే నిజమైనదిగా కనబడుతుంది. మామూలుగా, మనం భయపడే ఏ విషయమైనా చేయుటకు మనం ధైర్యంతో, నిశ్చింతగా ఉన్నట్లయితే, మనం ఎంత చెడుగా తలంచామో అంత చెడుగా ఆ విషయం లేదని గ్రహిస్తాము.

దేవుని వాక్యమంతటిలో దేవుడు తన ప్రజలతో "భయపడకుడి" అని మరల మరల చెప్పడం చూడగలము. ఆ విధంగా ఆయన చెప్పడానికి కారణం సాతాను

వారి ఆశీర్వాదాన్ని దొంగిలించకుండ ఉండునట్లు వారిని ప్రోత్సహించడానికే అని నేను నమ్ముతున్నాను.

ఇదే విధంగా, మనం భయస్తులమని ఆయనకు తెలుసు. కాబట్టి మన ముందున్న పని చేయుటకు, ప్రభువు చెప్పుచున్న పని చేయుటకు ముందుకు సాగు నిమిత్తం ఆయన ఎల్లప్పుడు మనలను హెచ్చరిస్తూ ఉంటాడు, ప్రోత్సహిస్తూ ఉంటాడు. ఎందుకు? ఎందుచేతనంటే, వేరొక ప్రక్క మన కొరకు గొప్ప ఆశీర్వాదం ఉందని ఆయనకు తెలుసు.

అబ్రాము విషయంలో ఈ ఉదాహరణ మనము ఇది వరకే చూశాము.

## ధైర్యము మరియు విధేయత గొప్ప బహుమానాలు అందజేస్తాయి

“ఇవి జరిగినతరువాత యెహోవా వాక్యము అబ్రామునకు దర్శనమందు వచ్చి–అబ్రామా, భయపడకుము; నేను నీకు కేడెము, నీ బహుమానము అత్యధికమగునని చెప్పెను.”

ఆదికాండము 15:1

మనం ముందుగా చూసినట్లుగా, ఆదికాండము 12:1లో దేవుడు అబ్రాముకు గొప్ప ఆజ్ఞ యిచ్చాడు. మన స్వంత మాటలతో చెప్పాలంటే ఆయన ఈ విధంగా చెప్పాడు. “సామానంతా సర్దుకుని, నీకు తెలిసిన వారినందరిని వదలి, ప్రతి సౌకర్యం విడిచి, నీకు చూపించు స్థలానికి వెళ్ళు” అని చెప్పాడు.

అబ్రాము భయం ముందు మోకరించి వున్నట్లయితే, మిగిలిన వృత్తాంతం జరిగి ఉండేది కాదు. దేవుడు తన కేడెముగా ఉండే అనుభవం అతడు ఎన్నడు పొందేవాడు కాదు, తనకు కలిగిన గొప్ప నష్టపరిహారం కూడా పొందేవాడు కాదు, అత్యంత గొప్ప బహుమానం అతడు ఎన్నడు పొందుకునే వాడు కానే కాదు.

ఇదే విధంగా, యెహోషువ భయాన్ని జయించలేకపోయినట్లయితే వాగ్దాన దేశానికి దేవుని ప్రజలను నడిపించు విషయంలో ఆయన ఆజ్ఞకు లోబడక పోయినట్లయితే, దేవుడు వారి కొరకు ప్రణాళిక చేసి సిద్ధపరచిన ఆశీర్వాదాలు అతడు గాని, ఇశ్రాయేలు ప్రజలు గాని ఎన్నడు అనుభవించలేకపోయేవారు.

అపవాది కోరికలకు భయంతో మోకరించకుండ ఉండుటకు మనలను బలపరచే శక్తి దేవుని వాక్యంలో ఉంది. మనం భయాన్ని ఎదుర్కోవలసి వచ్చినప్పుడు సహితం, దేవుడు మనలను చేయమన్న పని చేయగలం.

# 2

# ప్రతి విషయాన్ని గురించి ప్రార్థించండి దేనిని గూర్చి భయపడవద్దు!

*"మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థతపొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థనచేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును."*

యాకోబు 5:16

# 2

# ప్రతి విషయాన్ని గురించి ప్రార్థించండి దేనిని గూర్చి భయపడవద్దు!

కొంతకాలం క్రితం ప్రభువు నాతో "ప్రతి విషయం గురించి ప్రార్థించు, దేనిని గూర్చి భయపడవద్దు" అని చెప్పాడు. కేశాలంకరణకు అపరిచితురాలైన వ్యక్తి దగ్గరకు వెళ్తున్నప్పుడు ఆమె నా తలవెంట్రుకలు సరిగా అలంకరించదేమోనన్న భయంతో, సందిగ్ధతలో ఉన్నప్పుడు పరిశుద్ధాత్ముడు నాతో ఈ విధంగా చెప్పాడు. "ఈ విషయం గురించి భయపడకు, దీని గురించి ప్రార్థించు. నీకు అవసరమైనది ఈ స్త్రీ నీకు చేయునట్లు ప్రభువుయొక్క అభిషేకము కొరకై ప్రార్థించు."

తరువాత రెండు వారాలకు పైగా, ప్రార్థనలో భయం గురించిన వివిధ విషయాలు ఆయన నాకు క్రమంగా చూపిస్తున్నాడు. వాటిలో చాలా వరకు నా జీవితంలోకి ప్రాకి, సమస్యలు సృష్టించాలని ప్రయత్నించే భయాన్ని ఎదుర్కోవాలని. ప్రతి విషయంలో అది ఎంత గొప్పదైనా లేక ఎంత ప్రాముఖ్యమైనదైనా లేక ఎంత చిన్నదైనా లేక లెక్కించనవసరములేనిదైనా సరే దానికి పరిష్కారం ప్రార్థన అని ఆయన నాకు చూపించాడు.

"భూదిగంతములనుండి నేను పట్టుకొని దాని కొనల నుండి పిలుచుకొనినవాడా, నీవు నా దాసుడవనియు నేను నిన్ను ఉపేక్షింపక యేర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను. నీకు తోడైయున్నాను భయపడకుము నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము (ఏ విషయం గురించి భయపడనవసరము లేదు) నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే, నీతియను నా దక్షిణహస్తముతో (విజయ హస్తముతో) నిన్ను ఆదుకొందును. నీ దేవుడనైన యెహోవానగు నేను — భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడిచేతిని పట్టుకొనుచున్నాను.

యెషయా 41:10,13

ఈ వాక్యభాగంలో ప్రభువు తన ప్రజలను భీతితో అటు యిటు చూడవద్దని లేక దిగులు చెందవద్దని, ఆయన వారి దేవుడనని చెప్పుచున్నాడు.

కొన్నిసార్లు మన పరిస్థితుల ప్రభావం వలన మనం భయపడతాము. అది సరియైన పద్ధతి కాదు. సమస్య మీద మనం ఎంత ఎక్కువ దృష్టి నిలుపుతామో, మన నోరు ఆడిస్తామో అంత ఎక్కువగా మనం భయపడతాం. దీనికి బదులు మన దృష్టి, మన నోరు దేవుని వైపు కేంద్రీకరించాలి. ఈ జీవితంలో మనం ఎదుర్కొనబోయే ఏ సమస్య అయినా ఆయన పరిష్కారం చేయగల సమర్థుడు.

మనలను బలపరచి కష్టాల్లో మనలను దృఢపరచుటకు, మనలను పైకి లేపి ఆయన దక్షిణ హస్తముతో మనలను నిలబెడతానని దేవుడు వాగ్దానం చేశాడు. మనం భయపడకూడదని కూడా ఆయన ఆజ్ఞాపించాడు. అయితే జ్ఞాపకముంచుకోండి, భయంతో కూడిన భావనలు రానీయవద్దని మనలను ఆజ్ఞాపించుట లేదు. గాని దానికి బదులు మనము భయముయొక్క అదుపులో ఉండకుండా చూచుకోవాలని చెప్పాడు.

“భయపడకుము, నేను నీకు సహాయము చేసెదను” అని ప్రభువు వ్యక్తిగతంగా నీకు, నాకు చెబుతున్నాడు. అయితే మన జీవితంలో ప్రతి విషయంలో క్రమం పెట్టుకునేంత వరకు, విశ్వాసంతో అడుగువేయుటకు చాలినంత విధేయత మనం కలిగివుండేంత వరకు దేవుని సహాయం మనం ఎన్నడు అనుభవించలేము.

ప్రసంగించుటకు నేను ఎప్పుడు దేవుని అభిషేకం పొందుతానో నీకు తెలుసా; నేను ప్రసంగ వేదిక మీద నడుస్తూ మాట్లాడడం ప్రారంభించినప్పుడు. అంతకు ముందు కాదు.

నేను బయటికి అడుగు వేసినప్పుడు మాత్రమే అభిషేకము పొందుదును. దేవుడు మనకు నేడు ఈ విధంగా సెలవిస్తున్నాడు, “నీ జీవితం మీద భయం పరిపాలించకుండా చూచుకోండి. నేను చేయమని చెప్పిన పని చేయడం ప్రారంభించండి. ఎందుచేతనంటే నేను నీకు చెప్పేది నీ ప్రయోజనం కొరకు. నా మాట విన్నందువల్ల కలిగే ఆశీర్వాదాలు నాకు తెలుసు. అట్లు చేయకుండా సాతాను వ్యతిరేకిస్తాడు అందుచేతనే వాడు నీకు ఎదురుగా వచ్చి భయపెడతాడు... ఈ కారణం బట్టి నేను నిన్ను భయపడవద్దని చెబుతున్నాను.”

## భయపడకుము, నీవు నా సొత్తు!

“అయితే యాకోబూ, నిన్ను సృజించినవాడగు యెహోవా ఇశ్రాయేలూ, నిన్ను నిర్మించినవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు - నేను నిన్ను విమోచించియున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను నీవు నా సొత్తు.

నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచున్నప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు.”

యెషయా 43:1,2

పరీక్షలగుండా, వివిధ రకాల శ్రమల గుండా మనం వెళ్తునప్పుడు భయపడవద్దని ప్రభువు ఇక్కడ చెబుతున్నాడు. అయితే దాని అర్థం ఏమిటంటే, మన జీవితాల్లో విజయం అనుభవిస్తామని. అయితే వీటిగుండా వెళ్లుట ద్వారా మాత్రమే తప్పక విజయం అనుభవించగలం. మనం వీటి గుండా ప్రయాణిస్తున్నప్పుడు, ఎక్కడికి పారిపోకూడదు.

మనం జలములలో బడి పోవుచున్నప్పుడు మనకు తోడైయుంటానని, అపజయములు మనలను ముంచవని, అగ్నిలో నడిచినప్పుడు అది మనలను కాల్చలేదు లేక తగులబెట్టదు అని ప్రభువు మనకు వాగ్దానం చేశాడు.

షద్రకు, మేషాకు అబేద్నగో అను ముగ్గురు హెబ్రీ బాలుర వృత్తాంతం మీకు జ్ఞాపకం ఉందా? వారు మండుచున్న భయంకర అగ్నిగుండంలో పడవేయబడ్డారు. అయినప్పటికీ వారికి ఎటువంటి హాని కలుగకపోవడం మాత్రమే కాదు గాని పొగవాసన సహితం లేకుండా వారు అగ్నిగుండం నుండి బయటకు వచ్చారు (దానియేలు 3:1-30).

అగ్నిగుండం వంటి భయంకర పరీక్షలో వేయబడడం వంటి పెద్ద భయాలు మనకున్నవి. మన తల వెంట్రుకలు సరిగా లేవేమోనన్న సాధారణ భయాలు కూడా మనకు ఉన్నవి.

కేన్సరు, గుండెనొప్పి, ప్రియుల మరణం వంటి గొప్ప కారణాల బట్టి గాని వన భోజనాల సమయంలో వర్షము వస్తుందేమో లేక కారు నిలిపే స్థలం దొరుకుతుందో లేదోనన్న భయం కూడా కలుగవచ్చు.

దాని పరిమాణం ఎంతైనా, కారణం ఏమైనప్పటికీ, భయం మాత్రం ఒకటే. అందునుబట్టి ఒకే విధానంలో భయంతో పోరాడాలి. మనం ఇంతకుముందు చూసిన విధంగా, ప్రార్థన ద్వారా దేవుని వాక్యంతో దీనిని ఎదుర్కోవాలి. మనం ప్రార్థించినప్పుడు మనం విశ్వసించాలి. భయము మన శత్రువు, దానిని ఆ విధంగానే చూడాలి.

## భయమునకు విరుగుడు విశ్వాసము

"మీలో ఎవనికైనను జ్ఞానము కొదువగా ఉన్నయెడల అతడు దేవుని అడుగవలెను, అప్పుడది అతనికి అనుగ్రహింపబడును. ఆయన ఎవనిని గద్దింపక అందరికిని ధారాళముగ దయచేయువాడు. అయితే అతడు ఏ మాత్రమును సందేహింపక విశ్వాసముతో అడుగవలెను; సందేహించువాడు గాలిచేత రేపబడి యెగిరిపడు సముద్రతరంగమును పోలియుండును. అట్టి మనుష్యుడు ద్విమనస్కుడై, తన సమస్త మార్గములయందు అస్థిరుడు గనుక ప్రభువువలన తనకేమైనను దొరుకునని తలంచుకొనరాదు."

యాకోబు 1:5–7

*విశ్వాసము మాత్రమే భయానికి విరుగుడు మందు:*

నీవు ఏదైనా విషం త్రాగినట్లయితే, దానికి విరుగుడు మందు తీసుకోవాలి, లేకపోతే ఆ విషం మనకు తీవ్రమైన నష్టం కలిగిస్తుంది; అంతేకాదు మరణం కూడా రావచ్చు. భయమనే విషం సయితము అంతే. దానికి విరుగుడు మందు కావాలి. భయానికి ఒకే విరుగుడు మందు, విశ్వాసము.

భయము వచ్చి మన తలుపును తట్టుచున్నప్పుడు, మనం విశ్వాసముతో దానికి జవాబు చెప్పాలి. ఎందుచేతనంటే విశ్వాసము ద్వారా గాక భయానికి జవాబు చెప్పే వేరే మార్గం లేదు. విశ్వాసానికి ప్రధాన వాహనం ప్రార్థన.

విశ్వాసమును సమస్య దగ్గరకు తీసుకువెళ్ళాలి, దానిని ఏదో విధంగా వదలి పెట్టాలి. విశ్వాసము లేకుండా ప్రార్థించడం సాధ్యమే (మనము ఎన్నోసార్లు ఈ విధంగా చేస్తాం) నిజమైన విశ్వాసము కలిగి ప్రార్థించకపోవడం అసాధ్యం. అనగా నిజమైన విశ్వాసం ప్రార్థనకు ఊతమిస్తుంది.

మనకు అవసరత కల్గినప్పుడు మనం ప్రార్థించాలని, విశ్వాస సహితమైన ప్రార్థనతో దేవుని అడగాలని యాకోబు మనకు చెప్పుచున్నాడు. ఈ రెండు మాటలు చాలా ప్రాముఖ్యమైనవి. మామూలుగా ప్రార్థించడం, విశ్వాసము కలిగి యుండడం ద్వారా ఆ విధంగా మనం చేస్తాం. మనం దేవుని నుండి కోరేది ఆయన దైవిక చిత్తము మరియు ప్రణాళిక ప్రకారం మనం పొందుకుంటాం.

అందునుబట్టి భయాన్ని జయించుటకు తాళపు చెవి యేదనగా సామాన్యమైన విశ్వాసముతో నిండిన ఎడతెగని ప్రార్థన.

## ఎల్లప్పుడు ప్రార్థించండి

ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి. (ప్రతి విషయంలో, ప్రతి సమయంలో దేవుని కొరకు ప్రతిష్టించుకొన్నవారి వలె ప్రార్థించండి)

ఎఫెసీయులకు 6:18

ఎఫెసీయులకు 6:10-17లో అపోస్తలుడైన పౌలు దేవుడిచ్చు సర్వాంగ కవచము గురించి మాట్లాడాడు. దానిని మనం ఏ విధంగా ఉపయోగించాలో, ఆత్మీయ యుద్ధంలో వాక్యమనే ఆయుధం ఎట్లు ఉపయోగించాలో ఆయన చెప్పాడు. ప్రతి ఆయుధం గురించి వివరించిన తరువాత 18వ వచనంలో "ఎల్లప్పుడు ప్రార్థన చేయుడి" అనే మాటలతో పౌలు తన సందేశం సమీక్షించాడు.

ఎన్నిసార్లు మనం ప్రార్థన చేయాలి?
ఎల్లప్పుడు ప్రార్థన చేయాలి.
ఏ విధంగా ప్రార్థన చేయాలి?
ఆత్మలో, అన్ని విధములైన ప్రార్థనలు చేయాలి.

తరువాతి అధ్యాయంలో వివిధ రకాల ప్రార్థనల గురించి మనం పరీక్షిస్తాం. అయితే ఇప్పుడు, “ఎల్లప్పుడు ప్రార్థన చేయడం” అంటే ఏమిటో పరిశీలిద్దాం.

దాని అర్థం ఏమిటి? మనం ఇంటికి కావలసిన వస్తువులు కొనుటకు దుకాణానికి వెళ్లినప్పుడు, మనం ప్రార్థించాలని మన హృదయంలో దేవుడు తలంపు పెట్టడం వలన ఆ దుకాణంలోని నడిచే స్థలంలో అప్పుడే మోకరించి ప్రార్థించాలని దీని అర్థమా?

నేను అనేకసార్లు నా మంచం ప్రక్కన మోకరించి ప్రార్థించాను. దేవుడు నన్ను నడిపించినప్పుడు, క్రింద సాష్టాంగపడి ముఖం నేల మోపి ఆయనకు ప్రార్థించిన సందర్భాలు ఉన్నాయి. ప్రార్థన చేసేటప్పుడు మనం ప్రార్థించే విధానం విషయం కలవరపడకుండ మనం జాగ్రత్తవహించాలి. సూపర్ మార్కెట్‌లో అటూ ఇటూ నడుస్తూ మనం మౌనంగా ప్రార్థించగలం కూడా.

జీవితంలో ఆయా పరిస్థితులను బట్టి రకరకాలుగా మనం ప్రార్థించగలం. ఉదాహరణకు ముగ్గురు లేక నలుగురు చిన్నపిల్లలు ఉన్న యౌవన తల్లి, పెరిగి పెద్దవారై బయటకు వెళ్లిపోయిన బిడ్డలతల్లి చేసే ప్రార్థన కంటే వేరైన ప్రార్థన చేస్తుంది.

ప్రార్థన గురించి మనం ఎంతో భక్తిగా మారి దీనిని ఒక విధంగా లేక వేరొక విధంగా చేయాలని మనం అనుకుంటాం. కాని మనం చూచినట్లుగా అట్టి తలంపును ప్రార్థనతో, దేవుని వాక్యంతో ఎదిరించాలి. మనము ప్రార్థించినప్పుడు, మనం నమ్మాలి. ఎలాగు ప్రార్థిస్తున్నాము ఎక్కడ ప్రార్థిస్తున్నాము ఎన్ని గంటలకు అన్నది ప్రాముఖ్యం కాదు. భయము మన శత్రువు కాబట్టి మనం మెళకువగా ఉండాలి. ఎప్పుడైనా ప్రార్థించు ఆశకలిగినప్పుడు, అవసరమైనప్పుడు ప్రార్థించాలి.

## యెడతెగక ప్రార్థన చేయుడి!

"యెడతెగక ప్రార్థన చేయుడి"

1 థెస్సలోనీకయులకు 5:17

యెడతెగక ప్రార్థన చేయమని ఈ వచనంలో వ్రాయబడి ఉంది.

ఈ మాటలు చదివినప్పుడెల్లా ఈ విధంగా ఆశ్చర్యపడ్డాను. "ప్రభువా, యెడతెగక ప్రార్థన చేయగలుగుటకు నాకు సాధ్యమేనా?" "యెడతెగక" అంటే ఆగిపోకుండ, ఎన్నడు విడిచిపెట్టకుండ అని అర్థం చేసుకున్నాను.

అది ఏ విధంగా సాధ్యమో నేను అర్థం చేసికోలేకపోయాను.

పౌలు చెప్పిన మాటలు ఏమిటోనన్న దానికి ఇప్పుడు సరైన గ్రహింపు కలిగివున్నాను. ప్రార్థన అంటే ఊపిరి పీల్చుకున్నట్లు, ఎల్లప్పుడు అనుకోని విధంగా చేసే కార్యము. ఇది మనకు తెలియకుండానే జరిగే ప్రక్రియ.

ఊపిరి పీల్చుకొనుట ద్వారా, నీవు, నేను బ్రతుకుచున్నాము. ఇది మన భౌతిక శరీరాలకు అవసరం. అదే విధంగా మన ఆత్మీయ శరీరాలు ప్రార్థన ద్వారా పోషింపబడుటకు, పుష్టి కలిగియుండుటకు తయారు చేయబడ్డాయి.

సమస్య ఏమంటే, మనకున్న మతపరమైన ఆలోచన విధానాన్ని బట్టి ప్రార్థనకు ఖచ్చితమైన సమయం పాటించకపోయినట్లయితే మనం గురి కోల్పోతామనే తప్పుడు అభిప్రాయం కలిగివున్నాం. ప్రార్థన విషయంలో గడియారానికి బదులుగా మనం మారిపోయాం.

మనం ఏ విధంగా ప్రార్థించాలో వివరించుటకు దేవుడు నాకు ఈ ఉదాహరణ ఇచ్చాడు. మనం రోజంతా ఊపిరి పీల్చుకున్న రీతిగా, (మన ఉచ్ఛ్వాసనిశ్వాసాలు లెక్కించకుండా) మన ప్రార్థనల జాబితాను లెక్కించకుండా మనం రోజంతా ప్రార్థించాలి.

ఎన్ని సెకండ్లకు ఊపిరి పీల్చుకోవాలి అన్న జ్ఞాపకం నిమిత్తం నేను గడియారం తీసుకువెళ్లను. ఒకరోజు ఎన్నిసార్లు నేను ఊపిరి పీల్చుకున్నానో లెక్కలు వ్రాసుకొనను. ఎన్నడు నాకు అవసరమైనప్పుడు క్రమం తప్పకుండా, ఎల్లప్పుడు దాని గురించి ఏ తలంపు లేకుండ ఊపిరి పీలుస్తూ ఉంటాను.

మన ప్రార్థనల విషయంలో కూడ అదే విధంగా ఉండాలి. రోజుకు ఎన్నిసార్లు నేను ప్రార్థిస్తానో నాకు తెలియదు; నేను రోజంతా ప్రార్థిస్తాను. నేను ఉదయం నిద్రలేచిన వెంటనే ప్రార్థించడం ప్రారంభిస్తాను. నేను రాత్రి నిద్రకు వెళ్లేవరకు ప్రార్థిస్తునే ఉంటాను. రోజంతా ప్రార్థిస్తూనే ఉంటాను. ప్రార్థనకు నియమింపబడిన ప్రత్యేక సమయంలో కూడా నేను శ్రద్ధ తీసుకొని ప్రార్థిస్తాను.

దీనంతటికీ, అర్థం, నేను వేరే పనులేమీ చేయడంలేదని కాదు, ఇతర కార్యాల కొరకు అందుబాటులో ఉండే సమయాలు ఉన్నాయి. రకరకాల ప్రార్థనల గురించి మనం ఆలోచిస్తున్నప్పుడు, ప్రతి కాలంలో, ప్రతి సందర్భంలో, ప్రతి స్థలంలో మనం ఎల్లప్పుడు ప్రార్థించగలమని చూస్తాం. దేవుడు ఆ ప్రార్థనలు వింటాడు. ఇతర విషయాల గురించి ప్రార్థించినట్లుగా ఆ ప్రార్థనలు కూడా ఆత్మీయమైనవే, శక్తివంతమైనవే.

మన ప్రార్థన జీవితం గురించి ఎంతో చెడుగా ఆలోచించాలని సాతాను ఎందుకు కోరుతాడో నీకు తెలుసా? ఎందుచేతనంటే ప్రార్థనను మనం సరిగ్గా చేయడం లేదని మనం అనుకునేలా వాడు చేయగలిగితే, దానిని చేయాలనే విధానంలోనే చేస్తాము గాని మనం ఎటువంటి విశ్వాసము విడుదల చేయలేము అని వాడికి తెలుసు, అందునుబట్టి ఇది మనకు ఏ మాత్రం మంచి చేకూర్చదు.

## ప్రార్థనకు తగిన సూత్రాలు

పగలు మూడు గంటలకు ప్రార్థనకాలమున పేతురును యోహానును దేవాలమునకు ఎక్కి వెళ్లుచుండగా...

అపోస్తలుల కార్యములు 3:1

చాలా మంది వారి ప్రార్థన జీవితం గురించి అస్పష్ట నేరభావం కలిగి వుంటారు. అది అవసరం లేదు. ఎందుచేతనంటే ప్రతి వ్యక్తి అతడు లేక ఆమె వ్యక్తిగత ప్రార్థన జీవితం కలిగివుండాలి. ఎవరో ఒకరు కలిగివున్నట్లు మనం కూడా ప్రార్థన జీవితం కలిగి ఉండాలన్నది సరికాదు.

మనం అనుసరించవలసిన కొన్ని ఖచ్చితమైన ప్రార్థన సూత్రాలు ఉన్నాయి. అట్లు కలిగి యుండుట మంచిది, ఉదాహరణకు, మనం ఒక క్రమశిక్షణలో ఉండుటకు ప్రార్థన నిమిత్తం ఖచ్చితమైన సమయం, స్థలం కలిగి వుండాలి.

క్రొత్త నిబంధనలో సహితం, అపోస్తలుల కార్యముల గ్రంథంలో మనం చూచిన విధంగా, ఆది శిష్యులు ప్రార్థించుటకు నియమించబడిన స్థలానికి వెళ్ళుటకు రోజులో ప్రత్యేకమైన గంటలు కేటాయించుకున్నారు. అది మంచి వ్యక్తిగత క్రమశిక్షణ. దానిలో ఏమి తప్పులేదు. అయితే అది ప్రార్థనకు ప్రారంభంగా ఉండాలి. కాని ప్రతిసారి అట్లే ఉండాలని అర్థం కాదు.

అసలు విషయం ఏమిటంటే ప్రార్థన సమయం నియమించుకొనుటకు మనకు మనం క్రమశిక్షణ కలిగి ఉండాలి. అది మనకు వ్యక్తిగతంగా సరిపోతుంది. తరువాత ఆ సమయం మన జీవిత విధానంలో ఆలోచించకుండానే ఒక భాగంగా మారిపోయే వరకు దానికి కట్టుబడి ఉండాలి.

నా పండ్లు తోముకొనుటకు నేను క్రమశిక్షణ పొందినట్టి సమయం నాకు ఉంది. ఇప్పటికి ఆ విధంగానే చేస్తున్నాను. కాబట్టి దాని గురించి నేను యింకెంత మాత్రం ఆలోచించను గాని అలవాటు ప్రకారం శుభ్రం చేసుకుంటాను. రాత్రి పడుకోబోయే ముందు నా పళ్ళు తోముకుంటాను, ఉదయాన్నే లేచినప్పుడు, భోజనం తిన్న తరువాత నా పళ్ళు తోముకుంటాను. పళ్ళ శుభ్రత నా అనుదిన జీవితంలో ఒక అలవాటుగా మారిపోయింది.

మనం ప్రభువుతో నడుచుట ప్రారంభించినప్పుడు ఇదే వాస్తవాన్ని అన్వయించుకోవాలి. మొదటిగా మనం కొన్ని విషయాల్లో క్రమశిక్షణ పొందవలసి

వుండవచ్చు. ఎందుచేతనంటే ఎన్నో విషయాల్లో మనం ఎంతో క్రమశిక్షణలేని వారంగా ఉంటాము. అయితే కొంత కాలం తరువాత వాటి గురించి మనం ఆలోచించకుండానే అవి మన జీవితాల్లో సాధారణ దినచర్యలుగా మారిపోతాయి.

ఆ విధంగా చేయుటకు పరిశుద్ధాత్మను అనుమతించినట్లయితే, పరిశుద్ధాత్ముడు మనం విసుగక ప్రార్థించుటకు మనలను నడిపిస్తాడు, ఆ ప్రార్థన మన ఊపిరిగా మారుతుంది. అది జరిగినప్పుడు క్రమంగా మన ప్రార్థనలు పైకి వెళ్ళగలవు.

ప్రతిరోజు మనం నిద్రలేచిన వెంటనే "ప్రభువా, శుభదినము, నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పగలం. ఉదయకాల ఆహారానికి భోజనబల్ల దగ్గరకువెళ్ళి, "తండ్రీ, నీవు నా పట్ల ఎంతో మంచిగా ఉన్నావు" అని చెప్పగలము. మన ఉద్యోగ స్థలానికి బయలుదేరుతూ, "దేవా, నీకు వందనములు ఈ రోజు నా కొరకు నీవు చేయబోయే మంచి కార్యాలన్నిటి నిమిత్తం నీకు వందనములు" అని చెప్పగలం.

రోజంతా, సాయంత్రం వరకు దేవునితో మనం సంభాషించగలం. ఆయనను స్తుతించగలం, ఆరాధించగలం, ఆయన సన్నిధి మనతో ఉన్నందుకు ఆయనకు వందనాలు చెల్లించగలం, మన సమస్యలన్నిటిలో ఆయన సహాయం కోరగలం. రాత్రి మనం నిద్రించక ముందు, ఆ దిన ఆశీర్వాదాల నిమిత్తం కృతజ్ఞత, ప్రార్థన చేయగలం. ప్రశాంతమైన, శరీరంలో శక్తి కలిగించే రాత్రి నిద్ర కొరకు ముగింపు ప్రార్థన చేయగలం.

ఇప్పుడు సాతాను అది ప్రార్థన చేయడం కాదని మనతో చెప్పుటకు ప్రయత్నించవచ్చు. ఎందుచేతనంటే ప్రార్థనలో మన శరీరాన్ని సరైన అమరికలో ఉంచలేదు. లేక "సంఘంలో ప్రార్థించిన" భాషలో అలవాటు ప్రార్థన చేయలేదు అని చెప్పవచ్చు. అప్పుడే సాతాను పళ్లు విరగ కొట్టాలి. ఎందుచేతనంటే ప్రార్థన శరీరానికి సంబంధించినది కాదు, లేక నోటికి సహితం సంబంధించినది కాదు; ఇది ఆత్మకు, మనసుకు, హృదయానికి సంబంధించినది.

ఎక్కడైతే ప్రార్థన చేయబడుతుందో అక్కడ శక్తి ఉంటుంది!

## ప్రార్థన శక్తియైయున్నది

మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థతపొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థనచేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును.

యాకోబు 5:16

సామాన్యమైన విశ్వాససహిత ప్రార్థన శక్తివంతమైంది! వాస్తవానికి, హృదయ పూర్వకమైన, ఎడతెగని ప్రార్థన కంటె ఎక్కువ శక్తివంతమైనది వేరొకటి ఏమీ లేదు!

మన ప్రార్థన జీవితం గురించి సాతాను మనలను బాధపరుస్తాడు. మనము నమ్మకస్తులంగా ఉండకుండా మనలను బలహీన స్థితిలో ఉంచుటకే వాడు ప్రయత్నిస్తాడు. ఎడతెగని విశ్వాస సహితమైన ప్రార్థన అపవాది కార్యాలను నాశనం చేస్తుందని, ఈ భూమి మీద దేవుని చిత్తం జరుగునట్లు చేస్తుందని సాతానుకు తెలుసు.

ఏ సమయంలోనైనా నీవు, నేను మన ప్రార్థన జీవితం గురింతచి నేరస్థులంగా భావించడం ప్రారంభించినట్లయితే, దాని ద్వారా మనం విశ్వాసము కల్గిఉండే సామర్థ్యం కొల్పోవడం ప్రారంభమవుతుంది.

ఈ జీవితంలో దేవుడు మనకు యిచ్చిన పని సంపూర్తి చేయుటకు, ఆయన మన ప్రార్థనలు విని, వాటికి జవాబు యిస్తాడని మనకు నిశ్చయత ఉండాలి. అదే వారిని ఎంతో శక్తివంతులుగా, ఎంతో ప్రభావం గలవారిగా చేస్తుంది.

అందుచేత మనం భయపడుట మాని విశ్వాసంలో అన్ని రకాల ప్రార్థనలు ఎడతెగక చేయడం ప్రారంభిద్దాం.

# 3

# పలువిధములైన ప్రార్థనలు

*మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటే ముఖ్యముగా మనుష్యులందరికొరకును రాజులకొరకును, అధికారులందరి కొరకును, విజ్ఞాపనములును, ప్రార్థనలును, యాచనలును, కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను.*

1 తిమోతి 2:1

# 3

# పలువిధములైన ప్రార్థనలు

*“మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటే ముఖ్యముగా మనుష్యులందరికొరకును రాజులకొరకును అధికారులందరి కొరకును విజ్ఞాపనములును ప్రార్థనలును యాచనలును కృతజ్ఞతాస్తుతులును చేయవలెనని హెచ్చరించుచున్నాను.*

*ఇది మంచిదియు మన రక్షకుడగు దేవుని దృష్టికి అనుకూలమైనదియునై యున్నది.”*

1 తిమోతి 2:1-3

ఈ వాక్యభాగంలో మనం చూసిన విధంగా, మనలను గురించి మరియు ఇతరులను గురించి సమస్త విధములైన ప్రార్థనలు మనం చేయాలి.

ఎడతెగని, హృదయపూర్వక ప్రార్థనలో మనం నిమగ్నమై ఉండగల్గునట్లు మనం చేయవలసిన ఆయావిధములైన ప్రార్థనల్లో కొన్నిటిని చూద్దాము:

## సమర్పణ ప్రార్థన

"నీ మార్గమును యెహోవాకు అప్పగింపుము నీవు ఆయనను నమ్ముకొనుము ఆయన నీ కార్యము నెరవేర్చును."

కీర్తనలు 37:5

మొదటిగా సమర్పణ ప్రార్థన చేయాలి. ఈ ప్రార్థనలో మనలను, మన జీవితాలను ప్రభువునకు సమర్పించుకోవాలి. 1 పేతురు 5:7లో చెప్పబడిన విధంగా మన భారమంతా ఆయన మీద వేసినప్పుడు మనం, ఆ విధంగా చేయగలము. "ఆయన మిమ్మును గూర్చి చింతించుచున్నాడు గనుక మీ చింత యావత్తు ఆయన మీద వేయుడి" (1 పేతురు 5:7).

మనపై దాడిచేసి, మనలను నాశనం చేయుటకు భయపట్టే భయాలు, సమస్యలు మనం ఎదుర్కొన్నప్పుడు, మనం ఈ విధంగా ప్రార్థించవలసిన అవసరత ఉంది. "ప్రభువా, ఈ బరువును నాతో కూడా మోయలేను. ఇవి నన్ను బాధపరచుటకు నాకు ఇష్టము లేదు. నిన్ను సేవించుటకు ఆటంకపరిచే దీనిని నేను సహించను."

"తండ్రీ, నేను ఏ పని చేయాలని నన్ను పిలిచావో ఆ పని చేయుటకు నేను భయపడినప్పటికీ దానిని చేయుటకు నన్ను బలపరచుము దానిని చేయుటకు సామర్థ్యం యివ్వండి."

"దేవా, నా పరిస్థితి నీకు అప్పగిస్తున్నాను. సాతాను నా యెడల జరిగించబోవు ఏ కీడైనను దుష్టమైన అక్రమ కార్యమైనను అది నీ సమస్య గాని నా సమస్య కాదు. ఎందుచేతనంటే నీవు నాకు ఏమీ చేయమని చెప్పావో దానిని చేస్తాను గాని మిగిలిన సంగతి నీకు విడిచిపెడుతున్నాను."

భయము కలిగిన నిమిషములో, నీవు, నేను ప్రార్థించినట్లయితే, త్వరలోనో లేక ఆలస్యంగానో దేవుని శక్తి ద్వారా అది జయించబడడం మనము చూడగలము.

మనకు పలుమార్లు కష్టము కల్గించేవి గొప్ప సమస్యలు కాదు. ద్రాక్షతోటలను పాడు చేసే గుంటనక్కల వలె (పరమగీతము 2:15) పదే పదే పీడించే చిన్న చిన్న భయాలు, రాత్రింబవళ్ళు మన పైబడి మన జీవితాలను ఖాళీ చేసి, మన సంతోషాన్ని దొంగిలిస్తాయి.

అందువలన, భయసూచన కల్గినప్పుడు మొదటిలోనే, అది ఎంత చిన్నదైనా, దానిని ఎదిరించి ఇట్లు ప్రార్థన చేయాలి. “ప్రభువా, నేను భయంతో జీవించను. నా మార్గం నీకు అప్పగిస్తున్నాను. నన్ను మీరు కోరిన సమృద్ధియైన విజయవంతమైన జీవితాన్ని జీవించుటకు, ఉత్తమమైన పరిపూర్ణమైన నీ చిత్తాన్ని చేయకుండా, నా కొరకు నీ ప్రణాళికను అడ్డుకునే భయాన్ని మీరు జయించండి.”

అటువంటి హృదయపూర్వక, తృష్ణగల ప్రార్థన మనం చేసినట్లయితే, ప్రభువు మన విన్నపాన్ని సమర్పణను గౌరవిస్తాడు, మనం విడుదల పొందుటకు ఆయన కార్యం చేస్తాడు.

## సమర్పణ కొరకైన ప్రార్థన

> కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమునుబట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది.
>
> రోమా 12:1

ప్రార్థనలో దేవునికి ఏదైనా మనం యిచ్చినప్పుడు, ఆ ప్రార్థన అంకితం చేసే లేక సమర్పణ ప్రార్థన అవుతుంది. “ఇదిగో, ప్రభువా, నా డబ్బును, నా సమయాన్ని, నా మనస్సును అది ఏమైనప్పటికీ నీకు సమర్పిస్తున్నాను.” అని మనం ప్రార్థిస్తాము.

అపోస్తలుడైన పౌలు ఇక్కడ ఈ వాక్య భాగంలో మనకు ఈ విధంగా చెప్పుతున్నాడు. "ప్రభువుకు మన దేహాలను, ఇచ్చి సమర్పించుకోమని, ఆయనకు అంకితం చేసుకొమ్మని; ఆయన పని కొరకు మన శరీరావయవాలను, శక్తి సామర్థ్యతలను అన్నిటిని అర్పించమని. అట్లు చేయుట మనం చేయవలసిన కనీస కర్తవ్యం అని అదే ఆరాధన అని ఆయన అంటాడు.

దేవునికి మన పిల్లలను ప్రతిష్ఠించినప్పుడు కూడా మనం సమర్పణ ప్రార్థన చేయాలి. "తండ్రులారా, మీ పిల్లలకు కోపము రేపక ప్రభువు యొక్క శిక్షలోను బోధలోను వారిని పెంచుడి" (ఎఫెసీయులకు 6:4). అన్న వాక్యము ననుసరించి వారిని పెంచుటకు ఒప్పుకోవాలి.

మన జీవితాలు అంకితం చేసుకొని, సమర్పించుకున్న విధంగానే, మన మనసులు, మన శరీరాలు, మన వ్యక్తిత్వాలు, మన పిల్లలను దేవునికి ప్రతిష్ఠించాలి. అదే విధంగా మన నోళ్ళను కూడా ఆయనకు అంకితం చేయాలి, సమర్పణ చేయాలి. ఆ విధంగా చేయుటకు ఈ క్రింద చెప్పబడిన ప్రార్థన సహాయపడును.

## స్తుతి, ఆరాధన ప్రార్థన

"కాబట్టి ఆయనద్వారా మనము దేవునికి ఎల్లప్పుడును స్తుతియాగము చేయుదము, అనగా ఆయన నామమును ఒప్పుకొనుచు, జిహ్వాఫలము అర్పించుదము."

హెబ్రీయులకు 13:15

స్తుతి మరియు ఆరాధన అనుమాటలు మనందరికీ తెలిసినవని తలస్తున్నాను.

స్తుతి వాస్తవంగా దేవుని మంచితనాన్ని జ్ఞాపకం చేసుకొంటుంది. ఆయన మన పట్ల చేసిన ఉపకారలన్నిటిని వరుసగా లెక్కిస్తుంది.

ఆరాధన అనగా సాధారణంగా దేవుని పూజించడం. ఇది ఆయన "యోగ్యతను" అంగీకరించడం. ఆయన ఎవరో, ఆయన ఏమిటో ఆరాధన గుర్తిస్తుంది.

అందుచేత హెబ్రీ పత్రిక గ్రంథకర్త ఈ విధంగా వ్రాశాడు. "మనం ఎల్లప్పుడు, నిరంతరం దేవుని స్తుతించాలి, ఆరాధించాలి."

మనం చూసిన విధంగా, స్తుతి మరియు ఆరాధన ప్రార్థన ఇంటా బయటా, పగలు రాత్రి, అనుక్షణం మన ఊపిరిగా ఉండాలి.

మనం ఎల్లప్పుడు దేవునికి కృతజ్ఞతగలవారమై ఉండాలి. నిరంతరం ఆయనను అంగీకరిస్తూ, ఒప్పుకుంటూ, ప్రార్థనాపూర్వక స్తుతి ఆరాధనలో ఆయన నామము ఘనపరుస్తూ ఉండాలి.

## కృతజ్ఞతాస్తుతులతో నిండిన ప్రార్థన

"ప్రతి విషయమునందును (దేవునికి) కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి (పరిస్థితులు ఏ విధంగా ఉన్నప్పటికీ కృతజ్ఞత గలవారమై ఉండాలి, కృతజ్ఞతలు చెల్లించాలి). ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు (ఆ చిత్తము తెలియచేసే మధ్యవర్తి) మీ విషయములో దేవుని చిత్తము."

1 థెస్సలోనీకయులకు 5:18

1 థెస్స 5:17లో యెడతెగక ప్రార్థించుమని అపోస్తలుడైన పౌలు చెప్పాడు. వెనువెంటనే 18వ వచనములో మన పరిస్థితులెట్లున్ననూ మనము ప్రతి విషయములో దేవునికి కృతజ్ఞత చెల్లించుట దేవుని చిత్తమని చెప్పుచున్నాడు.

ప్రార్థనచేయుట మన జీవిత విధానంగా ఉండాలి. అదే రీతిగా దేవునికి కృతజ్ఞతాస్తుతి చెల్లించుట కూడా మన జీవిత విధానంగా ఉండాలి.

రోజులో ఒకసారి, ఏదో ఒక చోట కూర్చుండి, ఆయన చేసిన ఉపకారములన్ని తలంచుకొని, "దేవా నీకు వందనములు" అని చెప్పుట పెద్ద విషయమేమి కాదు. దేవునికి ఆ విధంగా చెప్పడం మంచిది అని నీవనుకొనుట మనలోని మతాసక్తిని తెలియపరుస్తుంది.

దేవుని యొక్క కృపను గూర్చిన నిజమైన జ్ఞానము కల్గి ఆయన చేసిన వాటిని ఎడతెగక జ్ఞాపకం చేసికొంటూ దానిని గురించి కృతజ్ఞతాస్తుతులు మన హృదయంలో నుండి పొంగిపొర్లాలి. అదే నిజమైన కృతజ్ఞత. ప్రార్థన చేయాలి గనుక చేయడం, దయను సంపాదించుకోవడం, మనకై మనం జయం పొందాలని ప్రయత్నించడం, దీవెన పొందడానికి యోగ్యులంగా చేసుకోవడం, వీటి వలన నిజమైన కృతజ్ఞత చెల్లించలేము.

దేవుని ఆత్మ మన ఆత్మలో నెరవేర్చిన కార్యం కోసం, ఆ ఆత్మ మనలో అల్లాడుచు మన నోటి నుండి స్తుతి చెల్లించుటకు మనలను ప్రేరేపించుటయే నిజమైన కృతజ్ఞత.

మరియు కీర్తనాకారుడు, 136:3లో "ప్రభువుల ప్రభువునకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించుడి" అని చెప్పుట నిజమైన రీతిగా కృతజ్ఞతాస్తుతులకు ఒక ఉదాహరణయైయున్నది.

## ఆత్మలో ప్రార్థించుట

ప్రియులారా, మీరు విశ్వసించు అతిపరిశుద్ధమైనదానిమీద మిమ్మును మీరు కట్టుకొనుచు, పరిశుద్ధాత్మలో ప్రార్థనచేయుచు, నిత్యజీవార్థమైన మన ప్రభువగు యేసుక్రీస్తు కనికరముకొరకు కనిపెట్టుచు, దేవుని ప్రేమలో నిలుచునట్లు కాచుకొని యుండుడి.

యూదా 20

ఎఫెసీ 6:18లో మనం చూసిన రీతిగా, మనమెల్లప్పుడు ప్రతి విధమైన ప్రార్థన విజ్ఞాపనలు చేయుట మాత్రమే గాక, యూదా వివరించిన రీతిగా మనం "పరిశుద్ధాత్మలో ప్రార్థించాలి."

దేవుని పరిశుద్ధాత్మ మనలో ఉండి మనకు ప్రార్థించుటకు తగిన ప్రేరణ కలుగగానే మనము ఆలస్యం చేయకుండా ప్రార్థన చేయుటలో అది ఒక భాగమైయున్నది. మనమెక్కడ ఉన్ననూ, ఏ పరిస్థితిలో ఉన్ననూ మనం ప్రార్థించాలి.

"ఎవ్రీ టైమ్ ఐ ఫీల్ ది స్పిరిట్ మూవింగ్ ఇన్ మై హార్ట్, ఐ విల్ ప్రే" అన్న పాటలో ఉన్న రీతిగా ప్రతిసారి మనం ప్రార్థించాలి. ప్రతిసారి మనం ప్రార్థించాలన్న జ్ఞానం మనకు కలిగితే, సరియైన సమయం కోసం, స్థలం కోసం మనము వెదకము.

## సమ్మతితో కూడిన ప్రార్థన

మరియు మీలో ఇద్దరు తాము వేడుకొను దేనినిగూర్చియైనను భూమిమీద ఏకీభవించినయెడల అది పరలోకమందున్న నా తండ్రివలన వారికి దొరకునని మీతో చెప్పుచున్నాను. ఏలయనగా ఇద్దరు ముగ్గురు నా నామమున ఎక్కడ కూడియుందురో అక్కడ నేను వారి మధ్యను ఉందునని చెప్పెను.

మత్తయి 18:19,20

ద్వితి.కాం 32:30లో దేవుడు తోడుగా ఉన్నప్పుడు ఒకడు వేయిమందిని, ఇద్దరు పదివేల మందిని పారదోలుదురని వ్రాయబడి ఉంది. అయితే ఆ యిద్దరు ఒకరితో ఒకరు మరియు ఆ యిద్దరు దేవునితోను సమ్మతిగల మనస్సు కల్గియున్నప్పుడు మాత్రమే ఆలాగు చేయగలరు. అనగా ఆ యిద్దరు మామూలు

విషయాల్లో వాదించుకొనుచూ, కలహ పడుచూ, ఉండి ప్రార్థన చేయునప్పుడు మాత్రమే ఒకరితో ఒకరు సమ్మతి కలిగియుండుటవలన వారి ప్రార్థన ఫలదాయకంగా ఉండదు.

1 పేతురు 3:7లో "అటువలెనే పురుషులారా జీవమను కృపావరములో మీ భార్యలు మీతో పాలివారైయున్నారని యెరిగి, ఎక్కువ బలహీనమైన ఘటమని భార్యను సన్మానించి, మీ ప్రార్థనకు అభ్యంతరము కలుగకుండునట్లు జ్ఞానము చొప్పున వారితో కాపురము చేయుడి" అని మనకు బోధించబడింది. అట్లు చేయకపోతే మీ ప్రార్థన ఫలదాయకంగా ఉండదు.

అదే రీతిగా దేవుని సేవకుని గూర్చి వారమంతా గుసగుస ముచ్చట్లు చెప్పుకొనుచు, నేరములు మోపుచు, ఆ తరువాత మనకు కల్గిన వ్యక్తిగతమైన గొప్ప సమస్యను గూర్చి ఆయన యొద్దకు వెళ్లి సమ్మతితో కూడిన ప్రార్థన చేయలేము. కారణమేమనగా మనము ఆ విధముగా చేయుట వలన ఒకరితో ఒకరము, దేవునితోను కలిసి సమ్మతి కలిగియుండలేము గదా?

సమ్మతితో కూడిన ప్రార్థనకు దేవుడు ఎందుకు జవాబిస్తాడో తెలుసా? కారణమేమనగా, మనం సమ్మతి కల్గియుండుట ఎంత కష్టమైన విషయమో దేవునికి తెలియును. కనుక సమ్మతి కల్గియుండు వారిని ఆయన ఘనపరచును.

నీవు నేను పరస్పరంగాను దేవునితోను సమ్మతికల్గియున్నప్పుడు మన ప్రార్థనలకు శక్తి కలిగి జవాబు కల్గియుండగలము.

## అందరు కలిసి చేయు సామూహిక ప్రార్థన

వీరందరును, వీరితోకూడా కొందరు స్త్రీలును, యేసు తల్లియైన మరియయు ఆయన సహోదరులును ఏకమనస్సుతో ఎడతెగక ప్రార్థన చేయుచుండిరి.

అపొస్తలుల కార్యములు 1:14

అందరూ కలసి సామూహికంగా చేయు ప్రార్థన గొప్ప శక్తి గలదిగా నుండును. ఈ వచనములో మనం చూసిన రీతిగా అట్టి ప్రార్థన ఏకమనస్సుతో చేయు ప్రార్థన అయియుండాలి.

అపోస్తలుల కార్యముల పుస్తకములో పలుచోట్ల దేవుని ప్రజలు ఏక మనస్సుతో ప్రార్థించారు. (అపోస్తలుల కార్యములు 2:1,46; 4:24; 5:12, 15:25). అపోస్తలుడైన పౌలు ఫిలిప్పీ 2:2లో ఈ విధంగా చెప్పాడు. “మీరు ఏకమనస్కు అగునట్లుగా, ఏక ప్రేమకల్గి ఏక భావముగలవారుగా ఉండి, ఒక్కదానియందే మనస్సుంచుచు, నా సంతోషమును సంపూర్ణము చేయుడి” అని చెప్పుచున్నాడు.

ఈ మాటలు మనం గమనించి, ఐక్యత కలిగియుండి, ఒకరితో ఒకరము, మరియు దేవునితోను సమ్మతిగల మనస్సు కల్గియుంటే, అపోస్తలుల కార్యముల పుస్తకములో వ్రాయబడిన రీతిగా, మొదటి శతాబ్దపు శిష్యులు ఎట్టి శక్తివంతమైన ఫలితములు చూడగలిగారో అట్టి ఫలితములను మనము కూడా చూడగలము.

## విజ్ఞాపన ప్రార్థన

మనము సంపూర్ణభక్తియు మాన్యతయు కలిగి, నెమ్మదిగాను సుఖముగాను బ్రదుకు నిమిత్తము, అన్నిటికంటె ముఖ్యముగా మనుష్యులందరికొరకును రాజులకొరకును, అధికారులందరి కొరకును, విజ్ఞాపనములును ప్రార్థనలును, యాచనలను, కృతజ్ఞతాస్తుతులను చేయవలెనని హెచ్చరించుచున్నాను.

1 తిమోతి 2:1

విజ్ఞాపన చేయుటయనగా ఎవరి నిమిత్తము విజ్ఞాపన చేయుచున్నామో వారికి దేవునికి మధ్యలో నిలువబడి, దేవుని సింహాసనము యెదుట ప్రార్థించుట.

రోమా 8:26,27లో దేవునియొక్క చిత్తప్రకారము పరిశుద్ధాత్మ మన పక్షమున విజ్ఞాపన చేయునని అపోస్తలుడైన పౌలు వ్రాయుచున్నాడు.

హెబ్రీ 7:5లో “యేసు మన పక్షమున దేవునికి విజ్ఞాపన చేయుచున్నాడని వ్రాయబడి ఉంది.”

ఆఖరిగా 1 తిమోతి 2:1లో మనము మనుష్యులందరి కొరకు విజ్ఞాపన చేయవలెనని అపోస్తలుడు ప్రోత్సహించాడు.

యేసు ప్రభువు భూమిమీద ప్రారంభించిన పరిచర్యను కొనసాగించుటకు విజ్ఞాపన ప్రార్థన చాలా ప్రాముఖ్యమైన సేవ.

## మౌన ధ్యాన ప్రార్థన

> అయితే యెహోవా తన పరిశుద్ధాలయములో ఉన్నాడు, ఆయన సన్నిధిని లోకమంతయు మౌనముగా ఉండునుగాక.
>
> హబక్కూకు 2:20

ఈ ప్రార్థనను “ప్రభువు కొరకు కనిపెట్టుచూ ప్రార్థించుట”యని నేను పిలుస్తాను.

దావీదు కీర్తన 27:4లో దావీదు దేవుని కొరకు కనిపెట్టుటను గూర్చి తనకు తెలిసినదంతటిని వ్రాయుచున్నాడు.“యెహోవాయొద్ద ఒక్క వరము అడిగితిని, దానిని నేను వెదకుచున్నాను. యెహోవా ప్రసన్నతను చూచుటకును, ఆయన ఆలయములో ధ్యానించుటకును నా జీవిత కాలమంతయు నేను యెహోవా మందిరములో నివసింపగోరుచున్నాను.

దేవుని సన్నిధిని కనిపెట్టుకొనియుండుట ఎంతో ప్రాముఖ్యమైన విషయము. అయితే చాలా మంది దేవుని సన్నిధిని కనిపెట్టుకొనియుండుట ఎంత ప్రాముఖ్యమో ఎరుగరు.

ప్రార్థనయనగా పెదవులు కదిలించుట మాత్రమే కాదు గాని, దేవుని కొరకు కనిపెట్టియుండుటయన్న ప్రక్రియ కూడా దానిలో ఇమిడియున్నది. ప్రార్థనలో మనము కేవలము మాటలాడుట మాత్రమే కాదు గాని, దేవుని మాటలు వినుటకు ఆయన సన్నిధిలో కనిపెట్టుకొనియుండవలెను.

## మనవులు తెలుపుకొను ప్రార్థన

దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత (ఖచ్చితమైన విన్నపాలు) కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి.

ఫిలిప్పీయులకు 4:6

మనవులు అనగా మనకు అవసరమైన వాటిని దేవుని యొద్ద విన్నవించుట మనవులతో కూడిన ప్రార్థన కూడా మనం తప్పక చేయాలి.

"ప్రభువా నాకు సాయం చేయండి" అన్న ప్రార్థన చాల గొప్ప ప్రార్థన అని నేనెప్పుడు చెబుతూ ఉంటాను.

నేను ఎన్నోసార్లు ఆలాగే ప్రార్థిస్తాను.

చాలాసార్లు నేను మధ్య రాత్రిలో మేల్కొని కాలకృత్యములు తీర్చుకొనేటప్పుడు నాలో ఏ తప్పు ఉన్నదో అనుకుంటాను. కాని నాకు ఏ తప్పు కనబడదు. అయినప్పటికి, నేను ప్రభువా నాకు సాయం చేయండి, అని పలుమార్లు ప్రార్థిస్తాను. ఆ విధంగా ప్రార్థించుటకు పరిశుద్ధాత్మ నాకు సాయం చేస్తున్నాడని నేను నమ్ముతాను.

"నాకు సహాయం చేయండి, ప్రభువా" అని ప్రార్థించుట గొప్ప ప్రార్థన. మనకు ప్రార్థించుటకు ఏ అంశములు లేక పోయిననూ, అట్టి ప్రార్థన చేయుట మంచిదని నేను తలస్తున్నాను.

మనవులడిగే ప్రార్థనలలో "దేవా నీవు నాకు అవసరము" అని చెప్పి ప్రార్థించుట కూడా చాలా మంచి ప్రార్థన.

పనులన్ని నేనే చేయాలన్న దృక్పథం మనం మార్చుకుంటే, మన జీవితాలలో అనేక గొప్ప మార్పులు జరుగుట మనం చూడగలము.

సామెతలు 3:5–7లో ఈ విధంగా వ్రాయబడింది. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక, నీ పూర్ణహృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును. నేను జ్ఞానిని గదా అని నీవనుకొనవద్దు. యెహోవాయందు భయభక్తులు గలిగి చెడుతనము విడిచిపెట్టుము."

నీవు దేవునియొద్దకు వెళ్లు విషయములో ఆలస్యము చేయవద్దు. నేను పడిపోయి, సంగతులు ఎట్లు మల్చుకోవలెనో నాకు చేతగానప్పుడు మాత్రమే నేను దేవుని యొద్దకు పరుగెత్తెదనని అనుకోవద్దు. ఏ ప్రయత్నం చేయకమునుపే సంగతులు నీ అదుపులో లేవని గుర్తించకమునుపే దేవునిపై పూర్తిగా ఆధారపడుము.

ఈ క్రింది ప్రార్థన చేయుటకు నేర్చుకొనుము. "దేవా నేను ఈ పని చేయలేను. అయితే ఆ పనిని నీవే నా ద్వారా చేయగలవు. నేను నా హృదయపూర్వకంగా నీ మీద ఆనుకొనుచున్నాను. నిన్ను నమ్ముకొనుచున్నాను. నీ యందే విశ్వాసము ధైర్యము కలిగియున్నాను. ప్రభువా నీవే నాకు సహాయపడాలి. నీవే నాకు అవసరము.

నీ జీవితంలో సంభవించు అతి కష్టపరిస్థితిలో సయితము ఆ చిన్న ప్రార్థన నీ అవసరతను తీర్చుటకు చాలినదైయున్నది.

దేవుడే మన సహాయకుడని నమ్ముకున్నందువల్ల మనమనేక చెడుగుల నుండి కాపాడబడుదుము. అయితే దేవుడు లేకుండా మనమేమి చేయలేమని మనం మనఃపూర్వకంగా గుర్తించాలి.

"దేవా నేను నీ మీద ఆధారపడుచున్నాను, నాకు సాయం చేయండి" అని ప్రార్థిస్తే మనం మనవులను ప్రభువుకు విన్నవించే ప్రార్థన చేయుచున్నామని అర్థము. అది చాలా శక్తివంతమైన ప్రార్థన. మన అవసరతలు, కోరికలు, ఆశలు తీర్చమని అడుగుట కూడా మనవులను తెలుపు ప్రార్థనయే. మనకు సంబంధించిన ఏ విషయాన్నైనా ప్రభువుతో అర మెరిక లేకుండా పంచుకోవలెను. ఆయన మనలను ప్రేమిస్తున్నాడు గనుక మనకు సంబంధించిన ప్రతి విషయాన్ని తనదైనట్లుగా ఆయన భావించును.

## ప్రప్రథమమైన సంగతులను ప్రప్రథమంగా చేయండి

అంతట వారు ప్రయాణమై పోవుచుండగా, ఆయన యొక గ్రామములో ప్రవేశించెను. మార్త అను ఒక స్త్రీ ఆయనను తన యింట చేర్చుకొనెను. ఆమెకు మరియ అను సహోదరి యుండెను. ఈమె యేసు పాదముల యొద్ద కూర్చుండి ఆయన బోధ–వినుచుండెను. మార్త విస్తారమైన పని పెట్టుకొనుటచేత తొందరపడి, ఆయనయొద్దకు వచ్చి – ప్రభువా, నేను ఒంటరిగా పనిచేయుటకు నా సహోదరి నన్ను విడిచిపెట్టినందున, నీకు చింతలేదా? నాకు సహాయము చేయుమని ఆమెతో చెప్పుమనెను అందుకు ప్రభువు–మార్తా, మార్తా, నీవనేకమైన పనులను గూర్చి విచారముకలిగి తొందరపడుచున్నావు. గాని అవసరమైనది ఒక్కటే మరియ ఉత్తమమైనదానిని ఏర్పరచుకొనెను.

లూకా 10:38–42

ఇంతవరకు మనం ధ్యానించిన దానిని బట్టి, ఇది వరకు నీకున్న ప్రార్థన జీవితము కంటే మేలైన ప్రార్థన జీవితము కల్గియుండుట సులభమేనని నీవు గ్రహించియుందువు. ప్రభువుకు ప్రార్థించుటకు ఒక నియమిత స్థలము, నియమిత సమయము కల్గియుండుట మంచి అలవాటే, ఉదయకాలం దానిని పాటించుట అవసరమే. కాని ఎల్లవేళల ప్రార్థించడం అతి శ్రేష్ఠం.

శక్తివంతమైన, కార్య సాధకమైన ప్రార్థన జీవితమును వృద్ధిపొందించు కొనుటకుగాను, దేవుని సన్నిధిలో కనిపెట్టుకొనియుండుట ఎంతో అవసరము. మనము క్రీస్తు యొక్క అనుచరులము గనుక, మన జీవిత విధానంలో ప్రభువు సన్నిధిని కనిపెట్టుకొని యుండుట బహు అవశ్యకము.

దినాన్ని ప్రారంభించక మునుపే, ఎంతో కొంత నియమిత సమయం దేవుని సన్నిధిలో గడిపి, ఇక దినమంతా ఆగమనంలోనే మనముండగలిగితే, అద్భుతమైన ఫలితాలు మన జీవితంలో సంభవించుట చూడగలము.

ఈ రోజు దేవుని సన్నిధిలో గడుపుటకు నాకు ఎక్కువ సమయం లేదే అని కొందరంటారు. అట్టివారు ఈ సూత్రాన్ని గమనించాలి. "ఏ రోజైనా ఎక్కువ పని ఈ రోజు నాకుంది" అని నీవు అనుకుంటే ఆ రోజు ఎక్కువ సమయాన్ని ప్రభువు సన్నిధిలో గడుపుటకు తగిన సమయం కేటాయించుకోవాలి."

మార్తవలె నీవెంతో పని కల్గియుండి ప్రభువు సన్నిధిని కనిపెట్టుకోలేను అనుకుంటే, ఏవైనా ప్రాధాన్యత లేని పనులు వెనుకకు నెట్టి వేసి ఆ సమయాన్ని ప్రభువు సన్నిధిలో గడపడానికి నేర్చుకోవాలి.

ఆ విధంగా అలవాటు చేసుకుంటే పరలోకరాజ్యపు తాళపు చెవులు నీ స్వాధీనంలో ఉంచుకోగలవు.

# 4

# పరలోకరాజ్యమునకు తాళపు చెవులు

*"పరలోకరాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను, ...*

మత్తయి 16:19

# 4

# పరలోకరాజ్యమునకు తాళపు చెవులు

*"యేసు ఫిలిప్పుదైన కైసరయ ప్రాంతములకు వచ్చి - మనుష్యకుమారుడెవడని జనులు చెప్పుకొనుచున్నారని తన శిష్యులను అడుగగా వారు - కొందరు బాప్తిస్మమిచ్చు యోహానననియు, కొందరు ఏలీయా అనియు, కొందరు యిర్మీయా అని లేక ప్రవక్తలలో ఒకడనియు చెప్పుకొను చున్నారనిరి. అందుకాయన - మీరైతే నేను ఎవడనని చెప్పుకొను చున్నారని వారి నడిగెను. అందుకు సీమోను పేతురు - నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని చెప్పెను"*

మత్తయి 16:13-16

యేసును గురించి పేతురు. "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని ప్రకటించినప్పుడు, అతని హృదయంలో ఉన్న విశ్వాసాన్ని తన నోటిద్వారా బహిర్గతం చేశాడు.

మన నోటి నుండి పలికే మాటలద్వారా మన హృదయంలో ఉన్న విశ్వాసాన్ని ధృవీకరిస్తున్నామని మనం అర్థం చేసుకోవాలి. రోమా 10:10లో ఈ విధంగా మనం చదువుతాము, "ఏలయనగా నీతి కలుగునట్లు మనుష్యుడు హృదయములో విశ్వసించును, (ఆయన ఇచ్చు) రక్షణ కలుగునట్లు నోటితో ఒప్పుకొనును."

అందుచేతనే ప్రార్థన ఎంతో ప్రాముఖ్యమైంది. మన అంతరంగంలో విశ్వసించిన విషయాలను గురించి బహిరంగంగా మాట్లాడడం ప్రారంభించి నప్పుడు మనం వాటిని స్థిరపరస్తున్నాము.

అందుచేత ప్రార్థనలో లేఖనాలు ఒప్పుకోవడం కూడా ఎంతో ప్రాముఖ్యం. మనం ఆ విధంగా చేసినప్పుడు, భౌతిక రాజ్యంలో మనం మాట్లాడే మాటల ద్వారా ఆత్మీయ రాజ్యంలో కార్యాలు స్థిరపరుస్తూ ఉన్నాము. చివరకు ఏమైతే ఆత్మీయంగా స్థిరపరచబడతాయో అవి భౌతికంగా బయలుపరచబడతాయి.

నీవు నేను దేవుని వాక్యం ఎడతెగక ఒప్పుకుంటూ ఉండాలి.

ఈ క్రింది విధంగా చెప్పాలి:-

"తండ్రీ, నీ యందు నేను విశ్వాసముంచాను. నీవు నన్ను ఎంతో ప్రేమించి, నా కొరకు సిలువ మీద మరణించుటకు నీ కుమారుడు యేసును పంపావు అని నేను విశ్వాసముంచాను.

నీ పరిశుద్ధాత్మతో నన్ను నింపావని నేను విశ్వసిస్తున్నాను. నా జీవితం కొరకు నీవు మంచి ప్రణాళిక కలిగియున్నావని, దానిని నెరవేర్చుటకు నీవు నాకు శక్తిని ఇస్తున్నావని నమ్ముచున్నాను.

నీ అభిషేకం నా మీద ఉన్నది కాబట్టి, నేను రోగుల మీద చేతులు ఉంచినప్పుడు వారు స్వస్థపడగలరని, దెయ్యాలను వెళ్ళగొట్టగలనని నేను నమ్ముచున్నాను.

నీ వాక్య ప్రకారం, నేను చేయదలచిన ప్రతి కార్యము అభివృద్ధి పొంది విస్తరిస్తుందని నేను నమ్ముచున్నాను."

దేవుని వాక్యంలో ఆయన మనలను గురించి చెప్పిన దానిని మన హృదయాల్లో విశ్వసించి, నోటితో ఒప్పుకుంటూ ముందుకు సాగాలి.

మనలను గురించి ఆయన చెప్పిన ఒక విషయం ఏమంటే, ఆయన మనకు భయపడు ఆత్మను యివ్వలేదు గాని శక్తి, ప్రేమ వివేచన గల మనస్సు మనకు ఇచ్చాడు. అందును బట్టి, మనం ఎల్లప్పుడు, "నేను భయపడను" అని ఒప్పుకుంటూ ఉండాలి.

## విశ్వాసము జయిస్తుంది

"అందుకు యేసు–సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు, పరలోక మందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలుపరచెనే కాని నరులు నీకు బయలు పరచలేదు. మరియు నీవు పేతురువు; ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను."

మత్తయి 16:17,18

ఈ వాక్యభాగంలో ఏ రాతిని గురించి యేసు మాట్లాడుచున్నాడు? ఆయన విశ్వాసమనే రాతిని గురించి మాట్లాడుచున్నాడు. ఆయన సీమోను పేతురుతో, ఆ సమయంలో అతడు చూపిన విశ్వాసము మీద తన సంఘాన్ని కడతానని ఆయన చెప్పుచున్నాడు. "...పాతాళ ద్వారములు దాని యెదుట నిలువనేరవని నేను నీతో చెప్పుచున్నాను" (18వ వచనం).

విశ్వాసమందు నడిచే వ్యక్తి ఎదుట పాతాళలోక ద్వారములు నిలువనేరవని దాని అర్థము.

భయం నరకం నుండి వస్తుంది. "అందుచేతనే యోహాను మనకు ఈ విధంగా చెబుతున్నాడు. "...భయము దండనతో కూడినది..." (1 యోహాను 4:18). అయితే భయాన్ని విశ్వాసముతో ఎదుర్కొన్నప్పుడు, పాతాళము దాని ముందు నిలువదు.

## పరలోకరాజ్యమునకు తాళపుచెవులు

"పరలోకరాజ్యముయొక్క తాళపుచెవులు నీ కిచ్చెదను, నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింప బడును, భూలోకమందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను."

మత్తయి 16:19

ఈ భాగమందు "పరలోకంలో ఏమి సంభవిస్తుందో, అది భూలోకంలో సంభవించుటకు నీకు శక్తి అధికారం ఇస్తున్నాను" అని యేసు ప్రభువు చెప్పుచున్నాడు.

మత్తయి 6:10లో యేసు శిష్యులకు ప్రార్థన నేర్పినప్పుడు తండ్రికి చేసిన ప్రార్థన యొక్క నెరవేర్పు ఇది. "పరలోకమందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధపరచబడు గాక, నీ రాజ్యము వచ్చునుగాక; నీ చిత్తము పరలోకమందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక."

తరువాత మత్తయి 18:18లో ఈ మాటలు యేసు శిష్యులతో చెప్పినప్పుడు, కట్టుటకును విడిపించుటకును ఇదే శక్తిని ఆయన వారికి ఇచ్చాడు. "భూమి మీద మీరు వేటిని బంధింతురో, అవి పరలోకమందును బంధించబడును; భూమి మీద మీరు వేటిని విప్పుదురో, అవి పరలోకమందును విప్పబడునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను."

పరలోకంలోని దేవుని చిత్తము భూమి మీద నెరవేర్చబడుటకు ఉపయోగపడే తాళాలు ఆయన వారికి ఇచ్చాడు. వాటిని వినియోగించుటకు శక్తిని, అధికారం కూడా ఆయన వారికి ఇచ్చాడని ప్రభువు వారితో చెప్పాడు.

ప్రభువు పేతురునకు మరియు ఇతర శిష్యులకు ఇచ్చిన తాళపు చెవులు, మనకు కూడా ఇచ్చాడు. మనం చదువుకున్న వివిధ రకములైన ప్రార్థనలే ఆ తాళపు చెవులు అయివుండవచ్చునని నేను భావించుచున్నాను.

## ఆసక్తికరమైన ప్రార్థన బహుబలముగా నుండును

"మీ పాపములను ఒకనితోనొకడు ఒప్పుకొనుడి; మీరు స్వస్థత పొందునట్లు ఒకనికొరకు ఒకడు ప్రార్థనచేయుడి. నీతిమంతుని విజ్ఞాపన మనఃపూర్వకమైనదై బహు బలముగలదై యుండును. ఏలీయా మనవంటి స్వభావముగల మనుష్యుడే; వర్షింపకుండునట్లు అతడు ఆసక్తితో ప్రార్థన చేయగా మూడున్నర సంవత్సరములు వరకు భూమిమీద వర్షింపలేదు. అతడు మరల ప్రార్థనచేయగా ఆకాశము వర్షమిచ్చెను, భూమి తన ఫలము ఇచ్చెను."

యాకోబు 5:16-18

ఏ సంస్థలోనైనా, శక్తి, అధికారం ఎవరికి ఉంటుంది? ఎవరైతే తాళపు చెవుల మీద ఆధిపత్యం చేస్తాడో ఆ వ్యక్తికే కదా? తాళపుచెవులు ఏమి చేస్తాయి? అవి తాళం వేస్తాయి, తాళం తీస్తాయి. అదే కట్టుట మరియు విడిచిపెట్టుట అంటే. తాళం వేయడం, తాళం తీయడం.

ఉదాహరణకు నీవు నేను ఎవరిని గూర్చియైనా విజ్ఞాపన చేసినప్పుడు, ఆ వ్యక్తి జీవితం మీద ఆశీర్వాదం విడుదల చేస్తున్నాం, అతన్ని లేక ఆమెను బంధకంలో ఉంచిన పాతాళ ద్వారాన్ని మనం తెరుస్తున్నాము.

అదే విధంగా, మనం దేవునికి కృతజ్ఞత ప్రార్థన చేసినప్పుడు మన స్వంత జీవితంలోని ఆశీర్వాదం అనే తాళం తీస్తున్నాము (విడుదల చేస్తున్నాము).

అందుచేత నీకు, నాకు దేవుని రాజ్యపు తాళపు చెవులు ఇవ్వబడ్డాయి. ఆ ప్రార్థన తాళపు చెవులతో పరలోకంలో ఉన్న దేవుని చిత్తం భూమి మీద నెరవేర్చబడుటకు మనం శక్తి, అధికారం కలిగి ఉన్నాము.

ఇది ఎంత గొప్ప ఆధిక్యత!

మన ప్రార్థన జీవితం బలమైనదికాదని ఆలోచించే ధోరణి కలిగి మనం మోసపోవాలని సాతాను కోరడంలో ఆశ్చర్యం లేదు. అందుచేత వాని చీకటి రాజ్యాన్ని జయించుటకు గొలుసు ప్రార్థనయను తాళపుచెవులు వాడుటకు బదులు ప్రార్థించడం మానివేస్తాం, అది వదులుకుంటాం.

నీ ప్రార్థనా జీవిత విషయంలో సాతాను నిన్ను అవమానించనివ్వవద్దు. దేవుని తెలుసుకోవడం ప్రారంభించండి, అన్ని రకాల ప్రార్థనలతో ఆయనను పిలవండి. నీకు పట్టుదల ఉన్నదని విశ్వసించు. ఆసక్తితో కూడిన హృదయపూర్వక ప్రార్థనలు ప్రభావితమైనవి. ఎందుచేతనంటే నీ విశ్వాసము ఆయన యందు ఉన్నది. పరిశుద్ధ జీవితం జీవించుట లేక వాగ్ధాటితో ప్రార్థించుట నీ సామర్థ్యం వలన కలిగేది కాదు.

## ప్రార్థన అనగా కావాలని అడుగుట

“దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి.”

ఫిలిప్పీయులకు 4:6

విన్నవించే ప్రార్థన గురించి మనం ధ్యానించినప్పుడు ఈ వాక్యభాగం మనం చూశాము.

విన్నపము అంటే ఏమిటి? ఈ వచనం ప్రకారం ఇది ఖచ్చితమైన విజ్ఞప్తి. ఖచ్చితమైన విజ్ఞప్తికి వేరొక మాట కావాలని అడుగుట. ఆ మాటకు అర్ధమేమి? సైన్యములో ఒక అధికారి తన క్రింద ఉన్న సైనికులకు కావలసిన సామాగ్రి కొరకు విన్నవించుట. ఒక వ్యక్తి ఏదైనా వస్తువు కొరకు అది న్యాయపరంగా తాను హక్కుదారుడై దానిని కోరడం లేక విజ్ఞప్తి చేయడం. తగిన అధికారం పొందిన సైన్య ప్రతినిధి, సామాగ్రి పొందుటకు అర్హుడు. అయితే ఆ సామాగ్రి పొందుటకు అతడు ఖచ్చితమైన విజ్ఞప్తి సమర్పించాలి.

మనం ప్రార్థించినప్పుడు, మనము చేసేది ఏమంటే, దేవుడు మన కొరకు దాచిపెట్టిన దానిని అవసరం వచ్చినప్పుడు ఆయన నుండి పొందుకొనునట్లు మనకు కావాలన్న కోరికతో అడుగుతాము.

అనుదిన జీవితం నుండి ఒక ఉదాహరణ చూడండి. నీకు నాకు బ్యాంకులో డబ్బు ఉండవచ్చు. అయితే ఆ డబ్బుతో మనం ప్రయోజనం పొందుటకు చెక్కు వ్రాయుట ద్వారా మనం మన అవసరత పత్రం సమర్పిస్తాము. బ్యాంకులో మన డబ్బు విడుదల చేయుటకు ఇది ఒక విజ్ఞప్తి. మనము ధృవీకరించిన వ్యక్తికి ప్రత్యేకమైన ఉద్దేశ్యం నిమిత్తం కొంత డబ్బు యిమ్మని విజ్ఞప్తి చేసినట్లౌతుంది.

ఇటువంటి విషయం మా కార్యాలయ అధికారులు నా భర్త దగ్గరకు వచ్చినప్పుడు జరుగుతుంది. నా భర్త మా పరిచర్యకు ఆర్ధిక రంగ అధికారి. మా కార్యాలయ అధికారులు, వారి కార్యాలయాల అవసరతల నిమిత్తం డబ్బు కొరకు నా భర్త దగ్గరకు వస్తారు. వారికి యివ్వవలసిన డబ్బు వారి కార్యాలయాల నిమిత్తం వేరుగా పెట్టినప్పటికీ, ఆ డబ్బును విడుదల చేయుటకు ముందు, దాని కొరకైన ధరఖాస్తు చేయాలి, ఆ డబ్బు ఎందు నిమిత్తం వాడబడుతుందో తెలియజేసే పత్రం వారు సమర్పించాలి.

ప్రార్థన కూడా ఆలాగే చేయాలి. మన అనుదిన జీవితం, మన పరిచర్య కొనసాగించుటకు అవసరమైన వాటిని పొందుటకు దేవునికి మన మనవుల పట్టి సమర్పించాలి.

## యేసు నామంలో అడుగుము:

"అటువలె మీరును ఇప్పుడు దుఃఖపడుచున్నారు గాని మిమ్మును మరల చూచెదరు, అప్పుడు మీ హృదయము సంతోషించును, మీ సంతోషమును ఎవడును మీయొద్దనుండి తీసివేయడు. ఆ దినమున మీరు దేని గూర్చియు నన్ను అడుగరు; మీరు తండ్రిని నా పేరట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను."

యోహాను 16:22,23

మనలను గురించి సమస్తము దేవునికి తెలియునని బైబిలు బోధిస్తుంది (కీర్తన 139:1–6). మనం ఆయనను అడుగక ముందే మన అవసరత ఏమిటో ఆయనకు తెలియును (మత్తయి 6:8,32). అయినప్పటికీ మనలను అడగమని ఆయన ఆజ్ఞాపించాడు (మత్తయి 7:7).

ఆశించుట ద్వారా నీవు, నేను ఏమి పొందుకోలేము. "నాకు ఎక్కువ డబ్బు ఉంటే బాగుండేది.లేక "ఈ తలనొప్పి బాధ నుండి ఉపశమనం పొంది వుంటే బాగుండేది" లేక "నేను భయపడకుండ వుంటే బాగుండేది" అని అటూ ఇటూ తిరుగుతూ చెప్పుకోవడం పరలోకమునకు విన్నవించవలసిన కోరిక కాదు.

యాకోబు 1:5–8లో ఉన్న ప్రకారం మనకు అవసరమైన దానిని విశ్వాసముతో అడగాలి, దేవుని ఆశీర్వాద నిధి నుండి మనం విన్నవించిన కోరికకు జవాబుగా అడిగిన దానిని పొందుకున్నామని నమ్మాలి.

యోహాను సువార్త 16వ అధ్యాయంలోని మాటలు యేసు సిలువకు వెళ్ళక ముందు తన శిష్యులతో చెప్పినవి. మనం ప్రార్థించినప్పుడు మనం విశ్వాస ముంచుట మాత్రమే కాదు గాని ఆయన నామంలో కూడా అడగాలి అని ఆయన స్పష్టం చేశాడు.

మనం చెప్పే ప్రతి విషయం చివర “యేసు నామంలో” అనే పదసముదాయం జత చేయడం కాదు. మనం ఈ విషయంలో జాగ్రత్త వహించకపోయినట్లయితే, మన నోటి నుండి వచ్చే ప్రతి వాక్యము చివర హల్లెలూయ; దేవునికి స్తోత్రం; లేక యేసు నామంలో” అనే మాటలు చెబుతూ మతపరంగా మారిపోతాం. అది జరిగినప్పుడు, ఆ మాటలు అర్థం లేనివిగా మారిపోతాయి. ప్రభువు ఆ విధంగా చెప్పలేదు.

పరలోకంలోని దేవుని చిత్తము భూమి మీద నెరవేర్చబడుట కోసం ఆయన మనలను చేయమని ఆజ్ఞాపించిన సందర్భంలో ఆయన నామంలో ఉపయోగించే అధికారం గురించి ఆయన మాట్లాడుచున్నాడు. దేవుని రాజ్యము నుండి మనకు అవసరమైన వాటి కొఱకు కుమారుని సంతకంగల వినతి పత్రం దేవునికి సమర్పించడం గురించి ఆయన మాట్లాడుచున్నాడు.

మా సేవ పరిచర్య జరిగించు సంస్థలో ఉద్యోగులకు విరామ సెలవులు ఉంటాయి. ఆ సెలవులు న్యాయపరంగా వారికి చెందినప్పటికీ, వాటి కొరకు దరఖాస్తు చేయకుండా ఒక్కరోజు కూడా వారు సెలవు పొందలేరు.

యేసు క్రీస్తు చిందించిన రక్తము ద్వారా కొనబడి, క్రయము చెల్లించిన స్వాస్థ్యము నీకు, నాకు పరలోకంలో వుంది (ఎఫెసీయులకు 1:11,12). ఇది న్యాయపరంగా, హక్కు పరంగా మనది. అయితే సమస్య ఏమంటే, మనం దాని కొరకు తగిన వినతి పత్రాలు సమర్పించుట లేదు.

మా అర్థిక అధికారి డేవ్‌కు మా పరిచర్యలోని ఏ ఉద్యోగియైనా సెలవు నిమిత్తము వినతి పత్రం సమర్పించినట్లయితే, ఆ ఉద్యోగి సెలవు తీసుకొనుటకు అనుమతించబడతాడు; అతని దరఖాస్తుపై అనుమతి ఉన్నట్లుగా గాని లేనట్లుగా గాని వ్రాయక ఆ దరఖాస్తు తిరిగి ఆతని చేరకపోతే అతడు వెంటనే డేవ్ దగ్గరకు వచ్చి, నేను సమర్పించిన వినతి దరఖాస్తు పోగొట్టావా? నాకు హక్కుపరమైన సెలవు నేను ఎప్పుడు పొందగలను?” అని అడుగుతాడు.

యేసు నామంలో నీవు, నేను దేవునికి వినతి పత్రం సమర్పించినప్పుడు, విశ్వాసముతో మనం అడిగినది మనం పొందకపోతే అప్పుడు మనం ప్రభువు దగ్గరకు వెళ్లి, ఆయనను అడుగుటకు హక్కు వుంది. "తండ్రీ, నా వినతి పత్రం గురించి నీవు మరిచిపోలేదు, అవునా?" అని అడగాలి. అది సిగ్గులేనితనం కాదు, అది విశ్వాసము. అట్లు చేయుట వాస్తవంగా ప్రభువును గౌరవిస్తుంది. ఎందుచేతనంటే ఆయన నమ్మకస్తుడు కాబట్టి తన మాట నిలబెట్టుకుంటాడని మనం ఎదురుచూస్తున్నట్లుగా ఆయన తెలుసుకుంటాడు.

## యేసు నామమును వాడుకొనుము

> "ఇదివరకు మీరేమియు నా పేరట అడుగలేదు; మీ సంతోషము పరిపూర్ణమగునట్లు అడుగుడి, మీకు దొరుకును."
>
> యోహాను 16:24

మన సంతోషం పరిపూర్ణమగుటకు మనం అడిగేది పొందు నిమిత్తం ఆయన నామంలో అడగమని యేసు మనకు ఆజ్ఞాపించాడు.

ఈనాడు విశ్వాసుల జీవితాల్లో సంతోషం లేకపోవడానికి ప్రధాన కారణాల్లో ప్రార్థన లేమి ఒకటి అని ఒప్పించబడ్డాను. ప్రార్థన చేయకపోవడానికి ఒక కారణం ఏమనగా దేవుని ప్రజలు శరీరానుసారంగా ప్రార్థనలు చేయుచున్నారు.

తాను పునరుత్థానుడైన తరువాత విషయాలు వేరుగా వుంటాయని యేసు తన శిష్యులకు చెప్పాడు. ఆయన తన మరణ పునరుత్థానాలకు ముందు శిష్యులు ఇది వరకు అనుభవించని నూతన శక్తి, అధికారం భవిష్యత్తులో కలిగివుంటారని ఆయన వారికి చెప్పాడు.

ఆయన వారితో ఈ విధంగా చెప్పాడు. "మీరు ఇక నన్ను ఏమి అడుగరు. మీరు నేరుగా తండ్రి దగ్గరకు వెళ్ళి, నా నామంలో మీరేమి అడిగినను ఆయన మీకు అనుగ్రహిస్తాడు."

యేసు నామంలో అడుగుట అంటే అర్థం ఏమిటి?

24వ వచనం ప్రకారం, యేసు నామంలో ప్రార్థించుట అంటే యేసు యొక్క వ్యక్తిత్వాన్ని దేవునికి సమర్పించడం.

మనము దేవుని దగ్గరకు వెళ్లి, మనమేమిటో ఆయనకు సమర్పించుకొనుటకు ప్రయత్నించడం అనేది ప్రార్థనలో మనం అత్యంత బలహీనంగా ఉండుటకు ప్రధాన కారణాల్లో ఒకటి. దానితో ఉన్న సమస్య ఏమంటే మనం ఏ విధంగానైనా అపజయం పాలైనప్పుడు మన పక్షంగా ఆయన కార్యం చేయుటకు ఆయనను ప్రభావం చేసే విషయం మన దగ్గర లేదని ఆలోచిస్తాం.

దేవుని దృష్టిలో మన నీతి మురికి గుడ్డల వలె ఉందని బైబిలు సెలవిస్తుంది (యెషయా 64:6). అందువలన యేసు రక్తము తప్ప దేవునికి నీవు, నేను ఏమి అర్పించలేము.

అందుచేత *"వాక్యము, నామము, రక్తము"* అను పేరుగల నా పుస్తకం గురించి నేను ఎంతో సంతోషిస్తాను. (పుస్తకం చివరలో ఉన్న పుస్తక జాబితా చూడండి). ఈ పుస్తకంలో ఈ విషయం వివరించాను.

యేసు రక్తముతో కప్పబడి, దేవుని కృపాసింహాసనం దగ్గరకు నీవు, నేను చేరియుండగా, ఆయన వాక్య ప్రకారం, ఆయన కుమారుడైన యేసు క్రీస్తు నామంలో విశ్వాసముతో ప్రార్థించినట్లయిన అటువంటి విన్నపాలు ఆయన అంగీకరించునని తెలుసుకొనగలము. మనము పరిపూర్ణులమని కాదు లేక యోగ్యులమని కాదు, లేక దేవుడు మనకు ఋణస్థుడని కాదు గాని ఆయన మనలను ప్రేమిస్తున్నాడు కాబట్టి ఆయన మనలను చేయమని పిలిచిన పని కొరకు మనకు అవసరమైనది యివ్వాలని ఆయన కోరుచున్నాడు.

యేసు నామంలో శక్తి ఉంది. ఆ మాట పలుకగానే పరలోకంలో, భూలోకంలో, ప్రతి మోకాలు వంగాలి (ఫిలిప్పీయులకు 2:10). ఆ నామములోని శక్తి ద్వారా

రోగుల మీద నీవు, నేను చేతులు వుంచినప్పుడు వారు స్వస్థపడతారు. దయ్యాలు వారిని విడిచి పారిపోతాయి, యేసు చేసిన కార్యాలు చేస్తాం. దేవుని మహిమార్థమై యేసు చేసిన కార్యాలకంటే గొప్ప కార్యాలు చేస్తాం (మార్కు 16:17,18; యోహాను 14:12).

యేసు రక్తము చిందించుట ద్వారా మన కొరకు మహిమాన్వితమైన స్వాస్థ్యం ఆయన కొన్నాడు. ఇప్పుడు మనం ఆయన స్వాస్థ్యమునకు పాలిభాగస్తులం (రోమా 8:17). ఆయన సిలువ బలియాగంద్వారా సంపాదించిన ప్రతి ఆశీర్వాదం మన కొరకు పరలోకంలో భద్రం చేయబడింది. ఆ భద్రం చేయబడిన స్వాస్థ్యమును పొందుటకు అవసరమైన తాళపుచెవులు మన దగ్గర ఉన్నాయి. ఆ తాళపుచెవులే మన ప్రార్థనలు.

భయంతో, లేమితో మనం జీవించనవసరం లేదు. ఆ తాళపుచెవులు ఉపయోగించడం ప్రారంభిద్దాం, ద్వారాలు తెరుద్దాం. ఆ విధంగా చేయడం వలన దేవుని మహిమార్థమై పరలోకపు ఆశీర్వాదాలు మన మీద కుమ్మరించ బడవచ్చు. పరలోకంలో దేవుని చిత్తము నెరవేరినట్లు ఆయన దైవ చిత్తము భూమి మీద నెరవేరును గాక. దాని ఫలితంగా మన సంతోషం పరిపూర్ణం కాగలదు.

# ముగింపు

భయము దేవుని నుండి వచ్చేది కాదు. భయము సాతాను నుండి వచ్చేది.

భయము పట్ల క్రైస్తవులు కలిగి ఉండవలసిన ఒకే ఒక దృక్పథం ఈ విధంగా ఉంటుంది. "భయం దేవుని నుండి వచ్చింది కాదు. కాబట్టి దీనిని అంగీకరించను లేక ఇది నా జీవితాన్ని అదుపుచేయుటకు అనుమతించను! నేను భయాన్ని ఎదుర్కొంటాను. ఇది నన్ను బాధించుటకు నరకం నుండి పంపబడిన ఒక ఆత్మ."

నిజమైన ప్రభువైన యేసు క్రీస్తు అధికారం క్రిందకు దేవుని ప్రజలు రాకుండ సాతాను ఉపయోగించే ఆయుధం భయము కలిగించే ఆత్మ అని నేను అనేక మార్లు చెప్పుతుంటాను.

ఏ విషయాలలో మనం బంధకంలో ఉన్నామో వాటి నుండి విడిపించి విమోచించుటకు దేవుడు మనతో మృదువుగా కార్యం చేస్తాడని నేను నమ్ముతున్నాను. "భయపడకుము" అనే అభయాలతో బైబిలు నిండి ఉంది. ఇంతకు ముందు ప్రస్తావించిన విధంగా "భయపడకుము" అంటే "పరుగెత్తవద్దు" అని నా జీవితంలోని స్వీయ సంఘటనల ద్వారా అర్థం చేసుకున్నాను.

"నీవు భయపడినట్లయితే" ఆ విషయంలో నిన్ను ధైర్యపరచాలని కోరుతున్నాను. భయము నుండి పారిపోక, ప్రార్థనతో, విశ్వాసముతో దానిని ఎదిరించుము.

భయాలన్నిటి నుండి దేవుడు నిన్ను విడిపించాలని కోరుతున్నాడని జ్ఞాపకముంచుకోండి.

F - False - అబద్ధపు

E - Evidence - ఋజువు

A - Appearing } నిజమైనదిగా కనబడుట

R - Real

*2వ భాగం*

# లేఖనభాగములు

# భయాన్ని జయించుటకు లేఖనభాగములు

అందుకు మోషే–భయపడకుడి, యెహోవా మీకు నేడు కలుగజేయు రక్షణను మీరు ఊరక నిలుచుండి చూడుడి; మీరు నేడు చూచిన ఐగుప్తీయులను ఇక మీదట మరి ఎన్నడును చూడరు.

నిర్గమకాండము 14:13

ఇదిగో నీ దేవుడైన యెహోవా యీ దేశమును నీకు అప్పగించెను. నీ పితరుల దేవుడైన యెహోవా నీతో సెలవిచ్చినట్లు దాని స్వాధీనపరచుకొనుము, భయపడకుము, అధైర్యపడకుమని నీతో చెప్పితిని.

ద్వితీయోపదేశకాండము 1:21

భయపడకుడి, వారిని చూచి దిగులుపడకుడి, నీతో కూడా వచ్చువాడు నీ దేవుడైన యెహోవాయే; ఆయన నిన్ను విడువడు నిన్నెడబాయడు.

ద్వితీయోపదేశకాండము 31:6

నేను నీ కాజ్ఞయిచ్చియున్నాను గదా, నిబ్బరముగలిగి ధైర్యముగా నుండుము, దిగులుపడకుము జడియకుము. నీవు నడుచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడైయుండును.

యెహోషువ 1:9

భూదిగంతములనుండి నేను పట్టుకొని దాని కొనల నుండి పిలుచుకొనినవాడా, నీవు నా దాసుడవనియు నేను నిన్ను ఉపేక్షింపక యేర్పరచుకొంటిననియు నేను నీతో చెప్పియున్నాను నీకు తోడైయున్నాను భయపడకుము (ఏ విషయము గురించి భయపడనవసరం లేదు)

నేను నీ దేవుడనై యున్నాను దిగులుపడకుము నేను నిన్ను బలపరతును నీకు సహాయము చేయువాడను నేనే నీతియను నా దక్షిణహస్తముతో నిన్ను అదుకొందును. నీ దేవుడైన యెహోవానగు నేను–భయపడకుము నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడిచేతిని పట్టుకొనుచున్నాను.

యెషయా 41:10,13

అయితే యాకోబూ, నిన్ను సృజించినవాడగు యెహోవా, ఇశ్రాయేలూ, నిన్ను నిర్మించినవాడు ఈలాగు సెలవిచ్చు చున్నాడు–నేను నిన్ను విమోచించియున్నాను భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను నీవు నా సొత్తు.

నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీ మీద

పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు.

యెషయా 43:1,2

ఏలయనగా మరల భయపడుటకు మీరు దాస్యపు ఆత్మను పొందలేదు గాని దత్తపుత్రాత్మను పొందితిరి. ఆ ఆత్మ కలిగినవారమై మనము–అబ్బా తండ్రీ అని మొఱ్ఱ పెట్టుచున్నాము.

రోమా 8:15

ఏ విషయములోను ఎదిరించువారికి బెదరక, అందరును ఒక్క భావముతో సువార్త విశ్వాసపక్షమున పోరాడుచు, ఏక మనస్సుగలవారై నిలిచియున్నారని నేను మిమ్మును గూర్చి వినులాగున, మీరు క్రీస్తు సువార్తకు తగినట్లుగా ప్రవర్తించుడి. అట్లు మీరు బెదరకుండుట వారికి నాశనమును మీకు రక్షణయును కలుగుననుటకు సూచనయైయున్నది. ఇది దేవునివలన కలుగునదే.

ఫిలిప్పీయులకు 1:28

దేనినిగూర్చియు చింతపడకుడి గాని ప్రతి విషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతాపూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి.

అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసు క్రీస్తు వలన మీ హృదయములకును మీ తలంపులకును కావలి యుండును

ఫిలిప్పీయులకు 4:6,7

దేవుడు మనకు శక్తియు ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమునుగల ఆత్మనే యిచ్చెను గాని పిరికితనముగల ఆత్మ నియ్యలేదు...

2 తిమోతి 1:7

ధనాపేక్షలేనివారై మీకు కలిగినవాటితో తృప్తిపొంది యుండుడి. – నిన్ను ఏమాత్రమును విడువను, నిన్ను ఎన్నడును ఎడబాయను అని ఆయనయే చెప్పెను గదా. కాబట్టి–ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము.

హెబ్రీయులకు 13:5,6

ప్రేమలో భయముండదు; అంతేకాదు; పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్లగొట్టును; భయము దండనతో కూడినది; భయపడువాడు ప్రేమయందు పరిపూర్ణము చేయబడినవాడు కాడు.

1 యోహాను 4:18

# భయంతో పోరాడుటకు ప్రార్థన

*ఓ దేవా, భయం నుండి నన్ను విడిపించు. ధైర్యంతో మరియు పరిశుద్ధ ధైర్యంతో వుండుటకు సహాయం చేయండి.*

*నేను భయపడకుండా సహాయం చేయండి. నేను కలిగి ఉండాలని నీవు కోరినవన్నీ పొందుకొనునట్లు ముందుకు పోవుటకు సహాయం చేయండి.*

*నీవు నన్ను ఎంతగా ప్రేమిస్తున్నావో తెలుసుకోడానికి సహాయం చేయండి. ఎందుచేతనంటే పరిపూర్ణమైన ప్రేమ (నా పట్ల నీ ప్రేమ) భయాన్నంతటిని తోలివేస్తుంది. యేసు నామంలో ప్రార్థిస్తున్నాను, తండ్రీ, ఆమేన్.*

# ప్రభువుతో వ్యక్తిగత సంబంధం నిమిత్తం ప్రార్థన

సమాధానకర్తయైన యేసును నీ ప్రభువుగా, రక్షకునిగా నీవు ఇంతవరకు అంగీకరించకపోయినట్లయితే ఈ క్రింది ప్రార్థన చేయుము.

*తండ్రీ,*

*నీవు లోకాన్ని ఎంతో ప్రేమించావు. కాగా నీ అద్వితీయ కుమారునియందు విశ్వాసముంచువాడు నశింపక నిత్య జీవము పొందునట్లు ఆయనను నా కొరకు మరణించడానికి అప్పగించావు.*

*విశ్వాసముద్వారా మేము కృపచేతనే రక్షించబడ్డామని, అది దేవుని వరమని నీ వాక్యం సెలవిస్తుంది. రక్షణ సంపాదించుటకు ఇంతకన్నా ఏమీ చేయలేను.*

*యేసు క్రీస్తు నీ కుమారుడని, లోకరక్షకుడని నా నోటితో ఒప్పుకుంటున్నాను. ఆయన సిలువలో నా కొరకు మరణించాడని నా పాపాలన్నిటిని భరించాడని, వాటికి వెల చెల్లించాడని నేను విశ్వసిస్తున్నాను. యేసును మరణం నుండి నీవు లేపావని నా హృదయంలో విశ్వసిస్తున్నాను.*

*నా పాపాలు క్షమించమని నేను నిన్ను కోరుచున్నాను. యేసును నా ప్రభువుగా ఒప్పుకుంటున్నాను. నీ వాక్య ప్రకారం, నేను రక్షించబడ్డాను, నీతో నిత్యత్వం గడపబోతున్నాను. తండ్రీ, నేను ఎంతో కృతజ్ఞుడను. నీకు నా వందనాలు. యేసు నామంలో ప్రార్థిస్తున్నాను, తండ్రీ ఆమెన్.*

యోహాను 3:16; ఎఫెసీయులకు 2:8,9, రోమా 10:9,10;
1 కొరింథీయులకు 15:3,4; యోహాను 1:9; 4:14-16; 5:1,12,13
చదవండి.

# రక్షణ కొరకు ప్రార్థన

దేవుడు నిన్ను ప్రేమిస్తున్నాడు మరియు ఆయన నీతో వ్యక్తిగత సంబంధమును కలిగియుండాలని ఆశిస్తున్నాడు. నీవు ఇంకను యేసును నీ స్వంతరక్షకునిగా అంగీకరించని యెడల ఇప్పుడే దానిని చేయుము. మీరు కేవలం మీ హృదయమును ఆయన కొరకు తెరచి ఈ ప్రార్థనను చేయుము.

"తండ్రీ, నేను నీకు వ్యతిరేకముగా పాపము చేసియున్నానని నాకు తెలియును. నన్ను క్షమించుము. నన్ను శుద్ధునిగా చేయుము. నేను మీ కుమారుడైన యేసులో నమ్మికయుంచుదునని వాగ్దానం చేయుచున్నాను. ఆయన నాకొరకు మరణించియున్నాడని - ఆయన సిలువపై మరణించినప్పుడు నా పాపములన్నింటిని ఆయన మోసాడని నేను నమ్ముదును. ఆయన మరణము జయించి తిరిగి లేచాడని నేను నమ్ముచున్నాను. నేను ఇప్పుడే నా జీవితమును యేసుకు అర్పించుచున్నాను.

తండ్రీ, మీ క్షమాపణ మరియు నిత్యజీవమనే బహుమతులను బట్టి మీకు వందనము. నీ కొరకు జీవించుటకు నాకు సహాయం చేయుము. యేసు నామములో ప్రార్థించుచున్నాను. ఆమేన్."

నీవు నీ హృదయముతో ప్రార్థించినప్పుడు దేవుడు నిన్ను అంగీకరించి, పరిశుద్ధ పరచి మరియు ఆత్మీయ మరణమనే బంధకము నుండి నిన్ను విడిపించెను,

సమయం తీసుకొని ఈ లేఖనమును చదివి మరియు ధ్యానించి మరియు మీ నూతన జీవితంలో ఆయనతో నడచుచున్న ఈ ప్రయాణంలో దేవుడు మీతో మాట్లాడునట్లు ఆయనను అడుగుము.

- యోహాను 3:16
- ఎఫెసీ. 1:4
- 1 యోహాను 1:9
- 1 యోహాను 5:1
- 1 కొరింథీ 15:3-4
- ఎఫెసీ 2:8-9
- 1 యోహాను 4:14-15
- 1 యోహాను 5:12-13

నీవు క్రీస్తుతో నీ సంబంధముతో ఎదుగుటకు ప్రోత్సహించబడునట్లుగా బైబిలును నమ్మే సంఘమును మీరు కనుగొనునట్లు దేవుని సహాయం కొరకు అడగండి. దేవుడెల్లప్పుడు మీతోనే ఉంటాడు మరియు దేవుడు మీ కొరకు దాచియుంచిన సమృద్ధియైన జీవితమును మీరు జీవించునట్లు ఆయన మిమ్ము్మను నడిపించును.

# రచయితను గురించి

జాయిస్ మేయర్ ప్రపంచంలోని ప్రసిద్ధిగాంచిన క్రియాపూర్వకమైన బైబిల్ బోధకులలో ఒకరు, ఆనందించుడి ప్రతిదిన జీవితం అనే ఆమె టివి మరియు రేడియో కార్యక్రమాలు ప్రపంచమంతటా వందలకొలది టివి నెట్‌వర్క్ మరియు రేడియో స్టేషన్స్‌లో ప్రసారమవుతుంది.

జాయిస్ వందల కంటే ఎక్కువ ఉత్తేజకరమైన పుస్తకాలను రచించారు. ఆమె పుస్తకాలలో ఉత్తమంగా అమ్ముడైన పుస్తకాలు – *గాడ్ ఈస్ నాట్ మ్యాడ్ ఎట్ యు; మేకింగ్ గుడ్ హ్యాబిట్స్, బ్రేకింగ్ బ్యాడ్ హ్యాబిట్స్; డు యువర్ సెల్ఫ్ ఎ ఫేవర్... ఫర్‌గివ్; లివింగ్ బియాండ్ యువర్ ఫీలింగ్స్; పవర్ థాట్స్; మనస్సే ఒక రణరంగం; లుక్ గ్రేట్ ఫీల్ గ్రేట్; ద కాన్ఫిడెంట్ వుమన్; ఐ డేర్ యు; మరియు నెవర్ గివ్ అప్!*

జాయిస్ ప్రపంచమంతటా అనేకమంది వేలమంది ప్రజలతో మాట్లాడునట్లు సంవత్సరమంతటా సదస్సులను నిర్వహిస్తూ విస్తారంగా ప్రయాణిస్తూ ఉంటారు.

Joyce Meyer Ministries—India
Post Bag No. 1
Jubilee Hills, Hyderabad
India
www.jmmindia.org

**Go to tv.joycemeyer.org to watch Joyce's messages in a variety of different languages.**

**You can also request Prayer on Toll Free number: 1800 3454 007**

## సమస్త భయము నుండి విడుదల పొంది నీవు స్వేచ్ఛగా జీవించవచ్చు!

చాలామంది ప్రజలు వారి జీవితాంతము భయముచేత బంధించబడి అంగవైకల్యము గలవారివలె ఉండెదరు. మరణసంబంధమైన భయమైననూ, లేక (ముఖమునకు వన్నె తెచ్చులాగున) సరిగా వెంట్రుకలు కత్తిరించు కొనలేదేమో అను భయమైనను, జీవితమును దుఃఖపూరితముగా చేయును! ఈ భయమును పలకరించి విడిచిపెట్టకూడదు గాని దీనిని ఎదుర్కొని దేవుని వాక్యము ద్వారా తొలగించవలెను. భయము మనలను తన అదుపులో ఉంచుకొనలేదని మనము ఋజువు చేయవలెను.

ఈ శక్తివంతమైన పుస్తకంలో ప్రసిద్ధ రచయిత్రి అయిన జాయిస్ మేయర్, లేఖనములో నుండి మరియు తన సొంత అనుభవము నుండి భయము అనే బంధకము నుండి బయటపడుటకు మార్గమును తెలియజేయుచు, భయమునకు సంబంధించిన ప్రశ్నలకు చక్కని సమాధానములు పొందుపరచారు. దేవుని వాక్యము ద్వారా భయమును ఏ విధముగా ఎదుర్కొనవలెనో, నీ జీవితమును భయము లేకుండా స్వేచ్ఛగా జీవించుటకు అనువుగా "దేవుని రాజ్యము యొక్క తాళపు చెవులు" ఏ విధముగా వాడుకొనవలెనో అన్న మర్మములు, జీవితమును మార్చగల సత్యములు, పరిపూర్ణమైన ప్రేమ అనునది భయమును ఏ విధముగా పారద్రోలునో మరియు భయమును తొలగించుటలో ప్రార్థన యొక్క పాత్ర ఏమిటో అను విషయములను జాయిస్ మేయర్ ఈ పుస్తకంలో వివరించారు.

నీ జీవితమును పిరికితనము, భయము అనునవి నీపై యొక్కదినమైననూ పరిపాలన చేయకుండా చూచుకో. భయమును సంపూర్ణముగా తొలగించి, ఈ దినమే స్వేచ్ఛను పొందుకొనుము!

---

### ఈ వరుసలోని ఇతర పుస్తకములు చదవండి

- *కృంగినతనమును గూర్చి ముక్కుసూటి మాట*
- *ఒంటరితనమును గూర్చి ముక్కుసూటి మాట*
- *నిరుత్సాహమును గూర్చి ముక్కుసూటి మాట*
- *మానసిక ఒత్తిడిని గూర్చి ముక్కుసూటి మాట*
- *అభద్రతా భావమును గూర్చి ముక్కుసూటి మాట*
- *చింతించుటను గూర్చి ముక్కుసూటి మాట*

JOYCE MEYER
MINISTRIES®
Sharing Christ – Loving People

Post Bag No. 1, Jubilee Hills,
Hyderabad - 500 033